


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 1 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి బుధవారం 14 జనవరి 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 1 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI WED14 JANUARY 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


## చైనా, పాక్ మనకంటే ముందున్నాయి....

### భారత్‌కు కూడా 'రాకెట్ ఫోర్స్' అవసరం: ఆర్మీ చీఫ్ జనరల్ ద్వివేది



- భారత్‌కు ప్రత్యేక రాకెట్ ఫోర్స్ కమాండ్ అవసరమన్న ఆర్మీ చీఫ్
- చైనా, పాకిస్థాన్‌లు ఇప్పటికే ఇలాంటి దళాలను ఏర్పాటు చేశాయని వెల్లడి
- పినాకా, ప్రళయ్, బ్రహ్మోస్ వ్యవస్థలతో ఈ కమాండ్ ఏర్పాటుకు ప్రతిపాదన
- పినాకా శ్రేణిని 300 కిలోమీటర్లకు పైగా పెంచేందుకు ప్రయత్నాలు
- ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ కూడా ఇదే బాటలో యోచిస్తున్నట్టు వెల్లడి

వివరాలు 2లో..

## ఇరాన్ లో భగ్గుమన్న ప్రజాగ్రహం...

### నిరసనల్లో 2 వేల మంది మృతి

- ఇరాన్‌లో నిరసనల్లో వేల మంది మృతి
- రాయిటర్స్‌కు వెల్లడించిన ఇరాన్ ప్రభుత్వ అధికారి
- ఆర్థిక సంక్షోభంతో దేశవ్యాప్తంగా చెలరేగిన ఆందోళనలు
- అల్లర్ల వెనుక విదేశీ శక్తుల హస్తం ఉందని ప్రభుత్వ ఆరోపణ
- దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవల నిలిపివేత



పెన్ పవర్ డెస్క్:ఇరాన్‌లో గత రెండు వారాలుగా కొనసాగుతున్న ఆందోళనలు తీవ్ర రూపం దాల్చాయి. ఈ నిరసనల్లో భద్రతా సిబ్బందితో సహా దాదాపు 2,000 మంది మరణించినట్లు ఇరాన్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి

వివరాలు 2లో..



## నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాలు...

### పాల్గొన్న మంత్రి లోకేశ్...



- నారావారిపల్లెలో సంక్రాంతి వేడుకలు
- సీఎం చంద్రబాబు, కుటుంబ సభ్యులతో కలిసి సంబరాల్లో లోకేశ్ సందడి
- ముగ్గుల పోటీలు, విద్యార్థుల క్రీడలను తిలకించిన నేతలు
- గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసిన చంద్రబాబు, భువనేశ్వరి

పెన్ పవర్ డెస్క్:తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో సీఎం చంద్రబాబు, కుటుంబ సభ్యులతో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ముందుగా టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను తిలకించారు. అనంతరం స్థానికంగా వివిధ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులతో నిర్వహించిన క్రీడా పోటీలను వీక్షించారు. క్రీడా పోటీలు ఆద్యంతం ఆసక్తికరంగా సాగాయి. వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినీ, విద్యార్థుల కు సీఎం చంద్రబాబు, భువనేశ్వరి బహుమతులు అందజేశారు. ఈ వేడుకల్లో భాగస్వాములైన ఉపా ధ్యాయులు, ఇతర సిబ్బందిని ఘనంగా సన్మానిం చారు. విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందితో కలిసి గ్రూప్ ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో నారా బ్రహ్మణి, తేజస్విని, ఎంపీ శ్రీ భరత్, నారా రోహిత్, నారా, నంద మూరి కుటుంబ సభ్యులతో పాటు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు తది తరులు పాల్గొన్నారు. ఈ వేడుక ల్లో మంత్రి లోకేశ్ తనయుడు నారా దేవాన్ష్ కూడా వివిధ గ్రామీణ క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నాడు. తాత చంద్రబాబు చేతులమీదుగా ఓ ప్రైజు కూడా అందుకున్నాడు.



## నారావారిపల్లె నుంచి పలు అభివృద్ధి పనులకు చంద్రబాబు శ్రీకారం

- నాలుగు రోజులు నారావారిపల్లెలోనే ముఖ్యమంత్రి బస
- నారా, నందమూరి కుటుంబాల కలయికతో నారావారిపల్లెలో సందడి
- కృష్ణా జలాలను కళ్యాణి డ్యామ్‌కు మళ్లించే పనులకు శంకుస్థాపన



పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన స్వగ్రామం నారావారిపల్లెలో సంక్రాంతి పండగను జరుపుకుంటున్నారు. నాలుగు రోజుల పాటు ఆయన తన సొంతూరులోనే గడపనున్నారు. నారా, నందమూరి కుటుంబాల కలయికతో నారావారిపల్లెలో సందడి నెలకొంది. పండుగ వేడుకల్లో పాల్గొంటూనే ముఖ్యమంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముఖ్యంగా తిరుమల–తిరుపతి, చంద్రగిరి ప్రాంతాల తాగునీటి సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం దిశగా పెద్ద అడుగు వేశారు. రూ. 126 కోట్లతో హంద్రీ నీవా బ్రాంచ్ కెనాల్ నుంచి కృష్ణా జలాలను కళ్యాణి డ్యామ్‌కు మళ్లించే పనులకు మూలపల్లి చెరువు వద్ద శంకుస్థాపన చేశారు. ఇది పూర్తయితే తిరుమల, తిరుపతి, చంద్రగిరి ప్రాంతాల్లో తాగునీటి సమస్య పూర్తిగా తీరుతుంది. మార్గంలోని కనితమధుగు, కొండారెడ్డికండ్రిగ, కేఆర్ కండ్రిగ, నాగపట్ల, మూలపల్లి వంటి ట్యాంకులకు నీరు సరఫరా అవుతుంది. సుమారు 1,150 ఎకరాలకు సాగునీరు కూడా లభిస్తుంది.

**ఈ పనులకు కూడా శ్రీకారం**

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ (యువతకు ఇండస్ట్రీ–ఓరియెంటెడ్ ట్రైనింగ్ కోసం, రూ. 1.4 కోట్లు).
కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సంజీవని ప్రాజెక్టు).
టాటా డీఐఎంసీ.
ఇండోర్ సబ్‌స్టేషన్ (33/11 ఎం సెమీ-ఇండోర్).
సీసీ రోడ్లు.

వివరాలు 2లో..



## కుక్క కరిస్తే రాష్ట్రప్రభుత్వాలదే బాధ్యత..

## ప్రతీ కుక్క కాటుకు భారీ ఫైన్

- వీధి కుక్కల దాడిలో ఎవరైనా గాయపడితే వాటికి తిండిపెట్టిన వారిదే బాధ్యత: సుప్రీంకోర్టు
- అంత ప్రేమ ఉంటే ఇంటికి తీసుకెళ్లి పెంచుకోవాలని సూచన
- రాష్ట్ర ప్రభుత్వాలే పరిహారం చెల్లించాలని హెచ్చరిక
- చర్యలు తీసుకోవడంలో విఫలమైనందుకు బాధ్యత వహించాల్సిందే

పెన్ పవర్ డెస్క్:వీధి కుక్కల విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. చిన్న పిల్లలు, వృద్ధులపై వీధి కుక్కలు దాడిచేసి గాయపరిస్తే.. వాటికి తిండి పెడుతున్న వారిదే బాధ్యత అని స్పష్టం చేసింది. వీధి కుక్కలపై అంత ప్రేమ ఉంటే వాటిని ఇంటికి తీసుకెళ్లి పెంచుకోవాలని సూచించింది. వీధి కుక్కల విషయంలో తమ ఆదేశాలను పాటించని రాష్ట్ర ప్రభుత్వాలపైనా సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. గాయపడ్డ వారికి పరిహారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే చెల్లించాలని స్పష్టం చేసింది. చర్యలు తీసుకోవడంలో విఫలమైనందుకు తాము నిర్దేశించిన పరిహారాన్ని చెల్లించాల్సి ఉంటుందని జస్టిస్ విక్రమ్ నాథ్ హెచ్చరించారు.

## తెలుగు రాష్ట్రాల మధ్య వైసీపీ, బీఆర్ఎస్ చిచ్చు పెడుతున్నాయి

- వైసీపీ, బీఆర్ఎస్ కలిసి తెలుగు ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్నాయన్న పట్టాభి
- సాక్షి, నమస్తే తెలంగాణ పత్రికలు ఉమ్మడిగా తప్పుడు కథనాలు రాస్తున్నాయని ఆగ్రహం
- జగన్ తన ఆస్తుల కోసం రాష్ట్ర ప్రయోజనాలను కేసీఆర్‌కు తాకట్టు పెట్టారని విమర్శలు
- రాయలసీమ లిఫ్ట్, పోలవరంపై జగన్, కేసీఆర్ నాటకాలు ఆడారని వ్యాఖ్యలు
- చర్చలతోనే సమస్యలు పరిష్కరించుకోవడం తమ ప్రభుత్వ విధానమని స్పష్టీకరణ

పెన్ పవర్ డెస్క్:తెలుగు రాష్ట్రాల మధ్య విభేదాలు సృష్టించి, రాజకీయ లబ్ధి పొందడమే లక్ష్యంగా వైసీపీ, బీఆర్ఎస్ పార్టీలు ఉమ్మడి కుట్రకు పాల్పడుతున్నాయని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తీవ్రంగా ఆరోపించారు. మంగళగిరిలోని

వివరాలు 2లో..




## ఇకపై నో 10 మినిట్స్ డెలివరీ..

## డెలివరీ బాయ్స్‌కు కేంద్రం గుడ్ న్యూస్

- 10 నిమిషాల డెలివరీ విధానానికి స్వస్తి పలికిన క్విక్ కామర్స్ సంస్థలు
- డెలివరీ పార్ట్‌నర్ల భద్రతపై కేంద్ర కార్మిక శాఖ ఆందోళన
- సంస్థల ప్రతినిధులతో సమావేశమై సూచనలిచ్చిన మంత్రి మన్‌సుఖ్ మాండవీయ
- ఇప్పటికే '10 నిమిషాల డెలివరీ' ట్యాగ్‌లైన్‌ను తొలగించిన బ్లింకిట్
- త్వరలో జెప్టో, స్విగ్గీ, జొమాటో కూడా అనుసరించే అవకాశం




పెన్ పవర్ డెస్క్:డెలివరీ రంగంలో తీవ్ర విమర్శలకు దారితీసిన '10 నిమిషాల డెలివరీ' విధానానికి ముగింపు పడ నుంది. డెలివరీ పార్ట్‌నర్ల (గిగ్ వర్కర్లు) భద్రత, సంక్షేమంపై వెల్లువెత్తిన ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకుంది. బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ, జొమాటో

వివరాలు 2లో..

## తెలుగు ప్రజలకు భోగి శుభాకాంక్షలు తెలిపిన ఏపీ సీఎం చంద్రబాబు

- భోగి మంటలు ప్రతి కుటుంబానికి కొత్త వెలుగులు తేవాలని ఆకాంక్ష
- ప్రజల ఆశయాల సాధనకు అండగా ఉంటానని హామీ
- అందరి జీవితాలు భోగభాగ్యాలతో వర్ధిల్లాలని మనసారా కోరుకుంటున్నట్లు వెల్లడి

పెన్ పవర్ డెస్క్: భోగి పండుగ (జనవరి 14) సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబు తెలుగు ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి ముగ్గులతో తెలుగు లోగిళ్లు కళకళలాడుతున్న వేళ, ప్రతి ఒక్కరూ ఈ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన మంగళవారం నాడు ఒక ప్రకటన విడుదల చేశారు.



## సార్లంకపల్లె గ్రామం అగ్నికి ఆహుతి కావడంపై జగన్ దిగ్భ్రాంతి

- సంక్రాంతి పండుగ సందర్భంగా సార్లంకపల్లె గ్రామంలో తీవ్ర విషాదం
- మూడు పక్కా ఇళ్లు మినహా 38 పూరిళ్లు దగ్ధం
- బాధితులకు ప్రభుత్వం అండగా నిలవాలన్న జగన్



పెన్ పవర్ డెస్క్:కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం సార్లంకపల్లె అగ్ని ప్రమాదంపై వైసీపీ అధినేత జగన్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ గిరిజన గ్రామంలో 38 పూరిళ్లు దగ్ధం కావడం కలచి వేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. క్షణాల్లో ఊరంతా భస్మీపటలం కావడం విచారకరమని అన్నారు. బాధితులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం అండగా నిలవాలని... వారికి వసతి, ఆహారం అందించాలని సూచించారు. తక్షణ సాయంగా ఒక్కో బాధిత కుటుంబానికి లక్ష రూపాయల చొప్పున ఆర్థిక

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

## హాస్య రస గుళికలు...జంధ్యాల రచనలు

జంధ్యాల వీర వెంకట దుర్గా శివ సుబ్రహ్మణ్య శాస్త్రి. ఈ పేరు తెలుగు ప్రజలకు దాదాపు తెలియ దనే చెప్పాలి. కనీసం ఆ పేరు గల వ్యక్తి ఉన్నారని గాని, ఆయన సుపరిచితు లేనని, బహుముఖ ప్రజ్ఞాశాలి అని, అత్యంత ప్రజా దరణ పొందిన విజయ వంతమైన సినిమాలకు కథలు, ఆకట్టుకునే సంభాషణలు సమకూర్చారని, చిర కాలం గుర్తుండి పోయే చిత్రాలకు దర్శకత్వం వహించారని సినిమాల తో పరిచయం, సంబంధం ఉన్నా చాలా మందికి తెలియదు. ఆయనే ..హాస్యబ్రహ్మ గా పేరు పొంది, ఇంటి పేరుతో ప్రఖ్యాతి గాంచిన వెండితెర హాస్య బ్రహ్మ జంధ్యాల. జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి (జనవరి 14, 1951 – జూన్ 19, 2001 ) తెలుగు సినిమా రచయిత, దర్శకులు. జంధ్యాల అని ఇంటి పేరు తోటే సుప్రసిద్ధుడైన ఆయన అసలుపేరు జంధ్యాల వీర వెంకట దుర్గా శివ సుబ్రహ్మణ్య శాస్త్రి. ప్రత్యేకించి హాస్యకథా చిత్రాలు తీయ టంలో ఆయనది అందె వేసిన చెయ్యి. జంధ్యాల చెప్పిన ప్రసిద్ధ వాక్యం – నవ్వడం ఒక భోగం, నవ్వించడం ఒక యోగం, నవ్వక పోవడం ఒక రోగం. అనేది నానుడి.జంధ్యాల 1951 జనవరి 14 న పశ్చిమ గోదావరి జిల్లా నరసా పురంలో జన్మించాడు. బి.కామ్ వరకు చదువు కున్నారు. చిన్న తనం నుండి నాటకాల పట్ల ఆసక్తి గా ఉండేవారు. స్వయంగా నాటకా లు రచించారు. ఆయన రాసిన నాటకాల్లో "ఏక్ దిన్ కా సుల్తాన్, గుండెలు మార్చబడును" ప్రముఖ మైనవి. ఆయన నాటకాలు అనేక బహుమతులు అందుకున్నాయి.1974లో జంధ్యాల సినిమా రంగ ప్రవేశం చేసారు. శంకరాభరణం, సాగర సంగమం, అడవి రాముడు, వేటగాడు వంటి అనేక విజయ వంతమైన సినిమాలకు మాటలు రాశారు. ముద్ద మందారం సినిమా తో దర్శకుడిగా మారి, శ్రీవారికి ప్రేమలేఖ వంటి చిరస్మరణీయ చిత్రాన్ని సృజించారు.1976 లో దేవుడు చేసిన బొమ్మలు చిత్రం ద్వారా మాటల రచయితగా తన సినిమా జీవితం మొదలు పెట్టారు. ఐదేళ్ళలో సుమారు 85 సినిమాలకు రచయితగా పని చేయగా అందులో 80 శాతం సినిమాలు ఘనవిజయం సాధిం చడంతో మంచి రచయితగా పేరు తెచ్చుకున్నారు. తరువాత దర్శకు డిగా మారి, అనేక హాస్య చిత్రాలను రూపొందించారు. ఆరోగ్య కరమైన హాస్యానికి జంధ్యాల పేరు గాంచారు. హాస్యబ్రహ్మ అని పేరు పొందారు.రచయితగా 300కు పైగా సినిమాలు, దర్శకుడు గా షుమారు 50 సినిమాలు చేసారు. అప్పటి కామెడీ హీరోలకు లైఫ్ ఇచ్చాయి ఈయన సినిమాలు. ఆరోగ్య కరమైన హాస్యాన్ని అందించారు. శ్రీలక్ష్మి, బ్రహ్మానందం లాంటి వారిని ఈ రోజుకి ప్రేక్షకులు గుర్తుంచు కున్నారంటే ఆయన సినిమాలే కారణమనేది వాస్తవం. జంధ్యాల కేవలం హాస్యమే కాకుండా అన్ని రకాల ఎమోషన్స్ రచించే వారు. అజరామర 'శంకరా భరణం' చిత్రంతో పాటు 'సప్తపది' జంధ్యాల రచనకు తార్కాణాలుగా నిలిచాయి. సినిమా పరిశ్రమలో జంధ్యాల, కె.రాఘవేంద్రరావుల కాంబినేషన్ కు విశేష ప్రత్యేకత ఉంది. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'అడవి రాముడు', 'వేట గాడు', 'డ్రైవర్ రాముడు', 'జగదేక వీరుడు అతిలోక సుందరి' వంటి చిత్రాలను జన రంజకంగా రూపొం దించడంలో జంధ్యాల పాత్ర కీలకంగా నిలిచింది. అలాగే కె.విశ్వ నాథ్, జంధ్యాల కాంబినేషన్ కూడా సూపర్‌హిట్ చిత్రాలకు పెట్టింది పేరు. ఈ కాంబినేషన్‌లో 'శంకరా భరణం', 'సాగర సంగమం' వంటి చిత్రాలొచ్చాయి. దర్శకుడుగా ఆయన మొదటి సినిమా ముద్ద మందారం ఈరోజుకి అంత ఆదరణ పొందుతోంది అంటే ఆయన దర్శ కత్వ ప్రతిభే. కామెడీ చిత్రాలకు ఎక్కువగా పని చేసిన జంధ్యాల వేగవంతమైన రచయితగా పేరు తెచ్చు కున్నారు. పది రోజుల్లో సినిమాకు మాటలు రాసేవారు. ఆయన కళాత్మక చిత్రా లకు ఎంత హృద్యంగా రాశారో, హాస్య భరిత చిత్రాలకు అంత చిలిపిగా రాశారు. 1983లో, "ఆనంద భైరవి" చిత్రానికి ఉత్తమ ప్రాంతీయ చిత్రం దర్శకుడు జాతీయ అవార్డు, 1983లో, "ఆనంద భైరవి" చిత్రానికి ఉత్తమ దర్శకుడు నంది అవార్డు, 1987లో, "పడమటి సంధ్యారాగం" చిత్రానికి ఉత్తమ కథారచయిత అవార్డు, 1992లో, "ఆపద్బాంధవుడు" చిత్రానికి ఉత్తమ మాటల రచయిత అవార్డు లభించాయి.జంధ్యాల తన సినిమాల ద్వారా అనేక మంది నటులను... బ్రహ్మా నందం, నరేష్, ప్రదీప్, సుత్తి వీరభద్రరావు, సుత్తి వేలు తదితర నటీనటులను జంధ్యాల సినీ రంగానికి పరిచయం చేశారు.ఇంటి పేరు తోటే ప్రసిద్ధుడైన జంధ్యాలను మీ అసలు పేరు ఏమిటి అని అడిగితే ఆయన ఇలా అనేవాడు: "నేను రామానాయుడి సినిమాకు పనిచేసేటపుడు నాపేరు జంధ్యాల రామానాయుడు, విశ్వనాథ్ గారి సినిమాకు పనిచేసే టపుడు నా పేరు జంధ్యాల విశ్వనాథ్"... అలా అనేవారు తప్ప, తన అసలుపేరు ఎక్కడా చెప్పు కోలేదు.

జంధ్యాల 2001 జూన్ 19 న హైదరాబాదులో గుండె పోటుతో మరణించారు. ఆయనకు ఇద్దరు కూతుర్లు.... పేర్లు సాహితి, సంపద.

# చైనా, పాక్ మనకంటే ముందున్నాయి...

ఆధునిక యుద్ధ తంత్రంలో భాగంగా, దేశ రక్షణ కోసం ప్రత్యేకంగా ఒక రాకెట్ ఫోర్స్ కమాండ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. మారుతున్న భద్రతా పరిస్థితుల్లో ఇది వ్యూహాత్మకంగా చాలా కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్మీ డే సందర్భంగా మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

ప్రస్తుత యుద్ధ క్షేత్రంలో రాకెట్లు, మిసైళ్ల మధ్య వ్యత్యాసం తగ్గిపోయిందని, రెండూ నిర్ణయాత్మక ఫలితాలను ఇవ్వగలవని జనరల్ ద్వివేది పేర్కొన్నారు. మన పొరుగు దేశాలైన చైనా, పాకిస్థాన్‌లు ఇప్పటికే ప్రత్యేక రాకెట్ ఫోర్స్ లను ఏర్పాటు చేశాయని, వాటికి దీటుగా భారత్ కూడా అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన నొక్కి చెప్పారు. ఈ దిశగా సైన్యం తన దీర్ఘ శ్రేణి దాడి సామర్థ్యాలను గణనీయంగా పెంచుకుంటోందని తెలిపారు.స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన పినాకా రాకెట్ వ్యవస్థను ఇప్పటికే 120 కిలోమీటర్ల శ్రేణితో విజయవంతంగా పరీక్షించామని, దాని సామర్థ్యాన్ని 150 కిలోమీటర్లకు పెంచేందుకు ఒప్పందాలు కూడా జరిగాయని జనరల్ ద్వివేది వివరించారు. భవిష్యత్తులో దీని శ్రేణిని 300 నుంచి 450 కిలోమీటర్లకు పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నామని అన్నారు. పినాకా, ప్రళయ్, బ్రహ్మోస్ వంటి శక్తివంతమైన వ్యవస్థలను సమన్వయం చేస్తూ ఈ రాకెట్ ఫోర్స్ కమాండ్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు.

ఇటీవల జరిగిన 'ఆపరేషన్ సిందూర్' గురించి మాట్లాడుతూ, పాకిస్థాన్ నుంచి వచ్చిన అణు బెదిరింపులు కేవలం రాజకీయ స్థాయిలోనే ఉన్నాయని, సైనిక స్థాయిలో (డీజీఎంవోల మధ్య) అలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ఆ ఆపరేషన్ సమయంలో భారత దళాలు కేవలం 88 గంటల్లోనే భూతల దాడులకు పూర్తిస్థాయిలో సిద్ధమయ్యాయని, పాకిస్థాన్‌కు భారీ నష్టం కలిగించాయని గుర్తుచేశారు. ఈ ఆపరేషన్ తర్వాత, పాకిస్థాన్ కూడా ప్రత్యేక రాకెట్ ఫోర్స్ ఏర్పాటు దిశగా ఆలోచిస్తోందని నివేదికలు వస్తున్నాయని ఆయన తెలిపారు.

# ఇరాన్ లో భగ్గుమన్న ప్రజాగ్రహం...

- మొదటి పేజి తరువాయి

వెల్లడించారు. ఈ విషయాన్ని ఆయన రాయిటర్స్ వార్తా సంస్థకు తెలిపారు. ఇరాన్ ప్రభుత్వం ఇంత పెద్ద సంఖ్యలో మరణాలను అంగీకరించడం ఇదే మొదటిసారి.దేశంలో నెలకొన్న తీవ్ర ఆర్థిక సంక్షోభం, అధిక ద్రవ్యోల్బణం, స్థానిక కరెన్సీ (రియాల్) విలువ పడిపోవడంతో ప్రజలు రోడ్లపైకి వచ్చారు. డిసెంబర్ 28, 2025న తెహ్రాన్‌లోని గ్రాండ్ బజార్‌లో మొదలైన ఈ నిరసనలు, అనతికాలంలోనే దేశంలోని 31 రాష్ట్రాలకు విస్తరించాయి. ఈ మరణాలకు ఉగ్రవాదులే కారణమని, వారే ప్రజలు, భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని సదరు అధికారి ఆరోపించారు. అయితే, మృతుల్లో పౌరులు ఎంతమంది, భద్రతా సిబ్బంది ఎంతమంది ఉన్నారనే వివరాలు వెల్లడించలేదు.1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత అధికారంలోకి వచ్చిన మతపరమైన నాయకత్వానికి, గత మూడేళ్లలో ఇదే అతిపెద్ద అంతర్గత సవాలుగా మారింది. ఆర్థిక సమస్యలపై నిరసనలు చట్టబద్ధమే అని చెబుతూనే, ప్రభుత్వం కఠినమైన భద్రతా చర్యలు తీసుకుంటోంది. ఈ అల్లర్ల వెనుక అమెరికా, ఇజ్రాయెల్ హస్తం ఉందని ఇరాన్ ప్రభుత్వం ఆరోపిస్తోంది.గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంతో సమాచార వ్యాప్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. భద్రతా బలగాలు, నిరసనకారుల మధ్య ఘర్షణలు, కాల్పుల ఘటనలకు సంబంధించిన వీడియోలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఇరాన్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

## తెలుగు రాష్ట్రాల మధ్య వైసీపీ, బీఆర్ఎస్ చిచ్చు పెడుతున్నాయి

- మొదటి పేజి తరువాయి

టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రెండు పార్టీలు తమ స్వార్థ రాజకీయాల కోసం తెలుగు ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నాయని మండిపడ్డారు. చంద్రబాబు రెండు రాష్ట్రాలు బాగుండాలని ఆలోచిస్తే, వైసీపీ–బీఆర్ఎస్ మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.ఈ కుట్రలో భాగంగానే వైసీపీ, బీఆర్ఎస్ పార్టీల అధికారిక పత్రికలైన 'సాక్షి', 'నమస్తే తెలంగాణ' సమన్వయంతో పనిచేస్తూ ప్రజలను రెచ్చగొట్టేలా తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నాయని పట్టాభిరామ్ ఆరోపించారు. "తెలంగాణ నీటికి చంద్రబాబు అడ్డుపడుతున్నారని 'నమస్తే తెలంగాణ' రాస్తుంది. అదే సమయంలో, రాయలసీమకు ద్రోహం చేసి తెలంగాణకు న్యాయం చేస్తున్నారని 'సాక్షి' కథనం ప్రచురిస్తుంది. రెండు పత్రికలు, రెండు పార్టీలు, రెండు కుటుంబాలు కలిసి తెలుగు ప్రజలను మోసం చేస్తున్నాయి" అని ఆయన దుయ్యబట్టారు.

గతంలో ఇరు పార్టీల మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాన్ని పట్టాభిరామ్ గుర్తుచేశారు. "పోలవరం ప్రాజెక్టు ఎత్తు ఒక మీటర్ తగ్గించుకుంటే ఏమవుతుందని కేసీఆర్ అసెంబ్లీలో మాట్లాడితే, అప్పటి సీఎం జగన్ ఖండించకపోగా ఆయన్ను పొగడ్తలతో ముంచెత్తారు. జగన్ పుట్టినరోజున తాడేపల్లి ప్యాలెస్ ముందు కేసీఆర్, కేటీఆర్ ఫొటోలతో ఫ్లెక్సీలు కడతారు. ఇలాంటి బంధం రాష్ట్ర ప్రయోజనాల కోసం కాకుండా, కేవలం వారి రాజకీయ మనుగడ కోసమే" అని విమర్శించారు.

రాయలసీమ ఎత్తిపోతల పథకం విషయంలోనూ ఈ రెండు పార్టీలు నాటకాలు ఆడుతున్నాయని పట్టాభి ఆరోపించారు. "ఈ ప్రాజెక్టును తామే ఆపామని హరీశ్ రావు, సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నా... జగన్ వారిని ప్రశ్నించకుండా, కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం వెనుక మ్యాచ్ ఫిక్సింగ్ ఉంది. 'నీ రాష్ట్రంలో నువ్వు డ్రామా ఆడు, నా రాష్ట్రంలో నేను ఆడుతా' అన్నట్లుగా జగన్, కేసీఆర్ వ్యవహరించారు. ఈ ప్రాజెక్టుపై ఎన్జీటీ అభ్యంతరం వ్యక్తం చేసినప్పుడు జగన్ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదు? కేవలం డీపీఆర్ అంటూ రూ.1000 కోట్లు దోచుకున్నారు" అని ఆరోపించారు.

హైదరాబాద్‌లోని తన ఆస్తులు, ప్యాలెస్‌లను కాపాడుకోవడం కోసమే జగన్.. బీఆర్ఎస్ నేతలతో దోస్తీ చేస్తూ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆయన అన్నారు. కేవలం విందులు, చేపల పులుసు కోసమే తప్ప, రాష్ట్ర ప్రయోజనాల కోసం జగన్ ఏనాడూ పనిచేయలేదని విమర్శించారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు వద్దని, చర్చల ద్వారా సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నదే తమ కూటమి ప్రభుత్వ విధానమని పట్టాభి స్పష్టం చేశారు. వైసీపీ, బీఆర్ఎస్ కుట్రలను ప్రజలు గత ఎన్నికల్లోనే గ్రహించి బుద్ధి చెప్పినా వారి తీరు మారలేదని, ప్రజలు ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఇకపై నో 10 మినిట్స్ డెలివరీ.. డెలివరీ బాయ్స్‌కు కేంద్రం గుడ్ న్యూస్

- మొదటి పేజి తరువాయి

వంటి ప్రముఖ క్విక్ కామర్స్ సంస్థలు ఈ వేగవంతమైన డెలివరీ హామీని ఇకపై తమ యాడ్స్‌లో, బ్రాండింగ్‌లో ఉపయోగించకూడదని నిర్ణయించాయి.వివరాల్లోకి వెళితే, కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ మంగళవారం న్యూఢిల్లీలో క్విక్ కామర్స్ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. గడువులోగా డెలివరీ చేయాలనే తీవ్ర ఒత్తిడితో డెలివరీ సిబ్బంది రోడ్లపై ప్రమాదకరంగా ప్రవర్తిస్తున్నారని, వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు. డెలివరీ సమయానికి సంబంధించిన కఠిన నిబంధనలను తొలగించాలని ఆయన కోరారు. మంత్రి సూచనకు కంపెనీలు సానుకూలంగా స్పందించి, ఈ హామీని స్వచ్ఛందంగా తొలగిస్తామని హామీ ఇచ్చాయి.ఈ నిర్ణయం వెలువడిన వెంటనే, ప్రముఖ సంస్థ బ్లింకిట్ తన బ్రాండింగ్‌ను మార్చేసింది. '10,000కు పైగా ఉత్పత్తులు 10 నిమిషాల్లో డెలివరీ' అనే పాత ట్యాగ్‌లైన్‌ను తొలగించి, దాని స్థానంలో '30,000కు పైగా ఉత్పత్తులు మీ ఇంటి వద్దకే' అనే కొత్త ట్యాగ్‌లైన్‌ను చేర్చింది. ఈ మార్పు ద్వారా డెలివరీ వేగం కంటే సేవల నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు సంకేతాలిచ్చింది.గత కొంతకాలంగా '10 నిమిషాల డెలివరీ'

విధానంపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. తమ భద్రత, వేతనాల గురించి గిగ్ వర్కర్ల యూనియన్లు, ముఖ్యంగా ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్–బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ (×ఫీూ) వంటి సంస్థలు ఆందోళనలు, సమ్మెలు కూడా నిర్వహించాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ జోక్యం ప్రాధాన్యత సంతరించుకుంది. బ్లింకిట్ బాటలోనే జెప్టో, స్విగ్గీ, జొమాటో వంటి ఇతర సంస్థలు కూడా రానున్న రోజుల్లో తమ బ్రాండింగ్‌లో మార్పులు చేయనున్నట్లు తెలుస్తోంది.

# తెలుగు ప్రజలకు భోగి శుభాకాంక్షలు తెలిపిన ఏపీ సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

"దేదీప్యమానంగా వెలిగే భోగి మంటలు మీకు, మీ కుటుంబానికి కొత్త వెలుగులు తేవాలని మనసారా కోరుకుంటున్నాను. ప్రజల ఆశావహ దృక్పథంతో కూడిన ఆలోచనలు సాకారం కావాలి. అందుకు నేను మీకు అండగా ఉంటానని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను" అని చంద్రబాబు పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరి జీవితం భోగభాగ్యాలతో తులతూగాలని ఆకాంక్షిస్తూ, ప్రజలందరికీ మరోమారు భోగి పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఆయన తన సందేశంలో వివరించారు.

# సార్లంకపల్లె గ్రామం అగ్నికి ఆహుతి కావడంపై జగన్ దిగ్భ్రాంతి

- మొదటి పేజి తరువాయి

సాయం అందించాలని, కొత్త ఇళ్లు మంజూరు చేయాలని అన్నారు. కొత్త ఇళ్లు నిర్మించి ఇచ్చేంత వరకు వారికి అన్ని విధాలుగా అండగా నిలవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రమాదం వివరాల్లోకి వెళితే... మన్యం మారుమూలన ఉండే ఈ తండాలో అగ్నిప్రమాదం సంభవించింది. నిమిషాల్లోనే ఊరంతా కాలి బూడిద అయిపోయింది. మూడు పక్కా ఇళ్లు మినహా 38 పూరిళ్లు పూర్తిగా కాలిపోయాయి. అడవి తల్లిపై ఆధారపడి జీవించే గిరిజనులు సంక్రాంతి సందర్భంగా సరుకును కొనుగోలు చేసేందుకు తుని పట్టణానికి వెళ్లారు. ఆ సమయంలోనే ఈ ఘోరం సంభవించింది. 50 కిలోమీటర్ల దూరంలోని తుని నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చేటప్పటికే ఊరంతా అగ్నికి ఆహుతి అయిపోయింది.

## నారావారిపల్లె నుంచి పలు అభివృద్ధి పనులకు చంద్రబాబు శ్రీకారం

- మొదటి పేజి తరువాయి

అలాగే రంగంపేట–భీమవరం నుంచి శ్రీ శేషాచల లింగేశ్వరాలయంకు వెళ్లే బీటీ రోడ్డు (రూ.70 లక్షలు)ను కూడా ప్రారంభించారు. ఈ రోడ్డు వల్ల ఆలయానికి వెళ్లే భక్తులకు రాకపోకలు చాలా సులభమవుతాయి.

## వివేకా కేసులో కీలక పరిణామం.. మరోసారి సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన కుమార్తె



ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి వై.ఎస్. వివేకానందరెడ్డి హత్య కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) తదుపరి దర్యాప్తు పరిధిని కేవలం ఇద్దరు వ్యక్తులకు మాత్రమే పరిమితం చేస్తూ హైదరాబాద్ సీబీఐ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వివేకా కుమార్తె డాక్టర్ నర్రెడ్డి సునీతారెడ్డి సుప్రీంకోర్టులో కొత్తగా పిటిషన్ దాఖలు చేశారు.ట్రయల్ కోర్టు నిర్ణయం, తాము లేవనెత్తిన అంశాలకు, సుప్రీంకోర్టు గతంలో జారీ చేసిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉందని సునీత తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు అవసరంపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని గతంలో సుప్రీంకోర్టు ట్రయల్ కోర్టును ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ ఆదేశాల మేరకు విచారణ జరిపిన సీబీఐ కోర్టు, ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన అంశాలపై మాత్రమే దర్యాప్తును పరిమితం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పాక్షిక ఉత్తర్వులనే సునీతారెడ్డి తాజాగా సర్వోన్నత న్యాయస్థానంలో సవాల్ చేశారు.దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి సోదరుడైన వివేకానందరెడ్డి, 2019 మార్చి 15న కడప జిల్లా పులివెందులలోని తన నివాసంలో దారుణహత్యకు గురయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో దర్యాప్తు, విచారణ నిష్పక్షపాతంగా జరగడం లేదని ఆందోళనలు వ్యక్తమవడంతో, ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టుకు బదిలీ చేసింది. ఈ కేసులో కడప ఎంపీ వై.ఎస్. అవినాష్ రెడ్డి సహా పలువురిని నిందితులుగా చేర్చి సీబీఐ ఛార్జిషీట్లు దాఖలు చేసింది.సాక్షులను ప్రభావితం చేయడం, సాక్ష్యాధారాలను తారుమారు చేయడం వంటి అంశాలపై మరింత లోతుగా దర్యాప్తు జరపాలని సునీత మొదటి నుంచి న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. సునీత దాఖలు చేసిన ఈ తాజా పిటిషన్‌ను, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ఇతర పిటిషన్లతో కలిపి విచారిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది. ఈ పరిణామంతో ఆరేళ్లుగా కొనసాగుతున్న ఈ కేసులో దర్యాప్తు భవిష్యత్తు ఎలా ఉండబోతోందనే అంశంపై సుప్రీంకోర్టు తీర్పు కీలకం కానుంది.

## సార్లంకపల్లె అగ్నిప్రమాదం: బాధితులకు సీఎం చంద్రబాబు భరోసా... తక్షణ సాయం, పక్కా ఇళ్లు

కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం సార్లంకపల్లె గ్రామంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో 26 గిరిజన గుడిసెలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ప్రమాదం కారణంగా 33 కుటుంబాలు నిలువ నీడ కోల్పోయి నిరాశ్రయులయ్యాయి. అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఈ కుటుంబాలు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలాయి.ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. అధికారులతో మాట్లాడి బాధితులకు అన్ని విధాలుగా అండగా నిలవాలని ఆదేశించారు. తక్షణ సహాయంగా ప్రతి బాధిత కుటుంబానికి రూ.25,000 నగదు అందించాలని, ఇల్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ పక్కా గృహం మంజూరు చేయాలని స్పష్టం చేశారు. బాధితులకు తాత్కాలిక వసతి, ఆహారం అందించే ఏర్పాట్లు చేయాలని సూచించారు.సీఎం ఆదేశాల మేరకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జి రెడ్డి గ్రామాన్ని సందర్శించారు. బాధితులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వ సాయంపై భరోసా ఇచ్చారు.తహసీల్దార్ ఎస్వీ నరేశ్ మాట్లాడుతూ, 33 కుటుంబాలకు రూ.25 వేల చొప్పున నగదు పంపిణీ చేసినట్లు తెలిపారు. బాధితులందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం వారికి ఆహారం, ఇతర నిత్యావసరాలు అందించే పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ జరుపుతున్నారు.

# శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో సంక్రాంతి వేడుకలు



పలమనేరు,పెన్ పవర్,జనవరి 13,
సంక్రాంతి పండుగ వేడుకల్లో భాగంగా పట్టణంలోని పాతపేట నందు గల శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ముందస్తు మకర సంక్రాంతి పండుగ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు.ఇందులో భాగంగా మహిళలు పిల్లలు పలు రకాల సంప్రదాయ వేషధారణలో పాల్గొని పండుగ వేడుకలు అత్యంత ఘనంగా జరిపారు.మంగళవారం మధ్యాహ్నం పిల్లలకు బోగిపళ్ళ వేసే కార్యక్రమం,అనంతరం దేవాలయం ముందు బాలికలకు ముగ్గుల పోటీలు,బాలురకు గాలిపటాల పోటీలు నిర్వహించిన అనంతరం బోగిమంటలు వేసారు. చిన్నారులకు గొబ్బెమ్మ పాటలను పాడి అలరించారు.ఈ కార్యక్రమంలో పలువురు పట్టణ వాసులు పాల్గొన్నారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి జిల్లా । చిత్తూరు జిల్లా । వై.ఎస్.ఆర్. కడప జిల్లా ।

# నారావారిపల్లెలో అభివృద్ధి పండుగ

## రూ.కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన-ప్రారంభోత్సవాలు చేసిన సీఎం చంద్రబాబు







నారావారిపల్లె/తిరుపతి/పెన్ పవర్/జనవరి 13
నారావారిపల్లె గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా అభివృద్ధి పనుల శుభారంభంతో గ్రామం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయడంతో పాటు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించారు. మిల్లెట్ టిఫిన్స్, ఫుడ్ బాస్కెట్ ప్రోగ్రామ్, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలిస్తూ నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోషకాహారం ద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగుపడాలని సూచించారు.
స్టాళ్ల సందర్శన సమయంలో “నమస్తే సర్” అంటూ పలకరించిన అంగన్వాడీ చిన్నారులను చూసి సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా వారి వద్దకు వెళ్లి ఆప్యాయంగా మాట్లాడారు. పిల్లల చదువు, ఆరోగ్యం, భవిష్యత్తుపై శ్రద్ధ తీసుకోవాలని అంగన్వాడీ సిబ్బందికి సూచనలు చేశారు. షైనింగ్ సెంటర్స్ తమ పిల్లలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని, పిల్లల్లో స్పష్టమైన ఎదుగుదల కనిపిస్తోందని అక్కడున్న మహిళలు సీఎంకు వివరించారు. ఈ కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో విద్యా, ఆరోగ్య ప్రమాణాలను పెంచడంలో కీలకమని సీఎం పేర్కొన్నారు. అనంతరం రూ.1.4 కోట్లతో నిర్మించిన స్కిల్ బిల్డింగ్ సెంటర్‌ను సీఎం ప్రారంభించారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే రూ.4.27 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ సెమీ ఇండోర్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించి విద్యుత్ సరఫరా మరింత బలోపేతం అవుతుందని వెల్లడించారు.కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సంజీవని ప్రాజెక్టును సీఎం ప్రారంభించి, గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. అలాగే రూ.70



లక్షలతో ఎ-రంగంపేటభీమవరం రోడ్డు నుంచి శేషాచల లింగేశ్వర స్వామి ఆలయం వరకు నిర్మించిన రహదారిని ప్రారంభించారు.
నీవా బ్రాంచ్ కెనాల్ నుంచి కల్యాణి డ్యామ్‌కు, మూలపల్లి చెరువు సహా మరో నాలుగు చెరువులకు నీటిని తరలించే పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా సాగునీటి సమస్యలు తగ్గి రైతులకు లాభం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# నారావారిపల్లెలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న మంత్రి నారా లోకేష్







నారావారిపల్లె/పెన్ పవర్/జనవరి 13
తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో సీఎం చంద్రబాబునాయుడు, కుటుంబ సభ్యులతో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ముందుగా టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను తిలకించారు. అనంతరం స్థానికంగా వివిధ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులతో నిర్వహించిన క్రీడా పోటీలను వీక్షించారు. క్రీడా పోటీలు ఆద్యంతం ఆసక్తికరంగా సాగాయి. వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినీ, విద్యార్థులకు సీఎం నారా చంద్రబాబునాయుడు, భువనేశ్వరి బహుమతులు అందజేశారు. ఈ వేడుకల్లో భాగస్వాములైన ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందిని ఘనంగా సన్మానించారు. విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందితో కలిసి గ్రూప్ ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో నారా బ్రాహ్మణి, తేజస్విని, ఎంపీ శ్రీ భరత్, నారా రోహిత్, నారా, నందమూరి కుటుంబ సభ్యులతో పాటు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీకాళహస్తి ప్రజలకు భోగి సంక్రాంతి శుభాకాంక్షలు: కోట చంద్రశేఖర్



శ్రీకాళహస్తి ,పెన్ పవర్ , జనవరి, 13 :
శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు, నాయకులకు, అధికారులకు, నాయి బ్రాహ్మణ సంఘీయులకు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులకు భోగి, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్ తెలిపారు.ఈ పండుగలు అందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని, రైతాంగానికి మంచి పంటలు, ప్రజలందరికీ శాంతి సమృద్ధి కలగాలని ఆయన ఆకాంక్షించారు.

# కుటుంబ సమేతంగా చెంగాలమ్మ అమ్మవారిని దర్శించిన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే







శ్రీకాళహస్తి , పెన్ పవర్ , జనవరి 13 :
సూళ్లూరుపేటలో వెలసిన ఎంతో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి దేవి అమ్మవారి ఆలయాన్ని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధలతో, శాస్త్రోక్త విధానంలో అమ్మవారికి విశేష ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారి చల్లని కరుణాకటాక్షాలు సమస్త ప్రజలపై ఉండాలని ప్రార్థిస్తూ, ముఖ్యంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, శాంతి సమృద్ధులతో వర్ధిల్లాలని మనసారా కోరుకుంటున్నట్లు తెలిపారు.
ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్న తమ సేవా కార్యక్రమాలకు చెంగాలమ్మ తల్లి ఆశీస్సులు నిరంతరం నిలవాలని, నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని అమ్మవారిని వేడుకున్నారు.ఈ దైవ దర్శనంతో ఆలయ ప్రాంగణం భక్తి పరవశంతో పునీతమైంది

# రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌పై వైసీపీ అసత్య ప్రచారం -ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ తీవ్ర విమర్శ



గూడూరు, పెన్ పవర్,జనవరి,13:
రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై వైసీపీ నాయకులు కావాలనే అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ తీవ్రంగా మండిపడ్డారు.
కండలేరు డ్యామ్ గెస్ట్ హౌస్‌లో మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, శాసన సభ్యులు కురుగొండ్ల రామకృష్ణ,నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాయలసీమ ప్రాంతానికి సాగునీరు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా చర్యలు చేపడుతున్నాయని, అయితే వైసీపీ నేతలు రాజకీయ లబ్ధి కోసమే ప్రజల్లో భయ భ్రాంతులు కలిగించే ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.
లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరేలా పారదర్శకంగా పనులు కొనసాగుతున్నాయని, ప్రజలు వాస్తవాలను తెలుసుకొని అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఆయన సూచించారు.ఈ మీడియా సమావేశంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# హిందూ విశ్వాసాలపై వ్యవస్థీకృత దాడి

## -మిన్నల్ రవి, డా.ఉమేష్ రావు



శ్రీకాళహస్తి , పెన్ పవర్, జనవరి, 13 :
హిందూ ధర్మంపై దాడులే లక్ష్యంగా ఆలయాల్లో విధ్వంసం సృష్టిస్తూ, దేవాలయాల పవిత్రతను దెబ్బతీసే కుతంత్రాలకు పాల్పడుతున్న జగన్ రెడ్డి ముఠాకు పరమత సహనం లేదని వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు తీవ్రంగా విమర్శించారు.

జగన్ రెడ్డి అధికారంలో ఉన్న సమయంలో అంతర్వేది నృసింహ స్వామి ఆలయ రథం దగ్ధం కావడం, విజయనగరం జిల్లా రామతీర్థం బోడికొండ రామాలయంలో రాముడి విగ్రహం తల తొలగించడం, పితాపురంలో దేవతా విగ్రహాల ధ్వంసం, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో వెండి సింహాల దొంగతనం వంటి ఘటనలు జరిగినా జగన్ రెడ్డి కనీసం స్పందించకపోవడం ద్వారా హిందూ సమాజాన్ని అవమానించారని ఆరోపించారు.

తిరుమల తిరుపతి వంటి పవిత్ర క్షేత్రంపై కూడా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ భక్తుల మనోభావాలను పదే పదే దెబ్బతీస్తున్నారని తెలిపారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అద్భుత ఏర్పాట్లు చేసినప్పటికీ, వాటిని తట్టుకోలేక తిరుమల కొండపై ఖాళీ మద్యం సీసాలు పంపించి కుట్రలు పన్నారని ఆరోపించారు. సీసీ కెమెరాల ద్వారా ఆ కుట్రలు బయటపడ్డాయని పేర్కొన్నారు.

వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 'ఏడు కొండలు ఎందుకు, రెండు చాలు' అన్న వ్యాఖ్యలు, జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత టీటీడీ చైర్మన్ పదవిని అన్యమతస్తులకు కట్టబెట్టడం యాదృచ్ఛికం కాదని, ఇవన్నీ హిందువుల విశ్వాసాలపై వ్యవస్థీకృతంగా జరిగిన దాడులేనని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, తంగేళ్ల పాలెం పీఏసీఎస్ ఛైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు బాలసుబ్రహ్మణ్యం (మణి) తదితరులు పాల్గొన్నారు.



# ముగ్గుల పోటీలు,పిల్లల ఆటలు

## - గిరిజన కాలనీలో జనసేన సేవా కార్యక్రమం



శ్రీకాళహస్తి రూరల్ ,పెన్ పవర్ జనవరి 13:
తొట్టంబేడు మండలం పొయ్య పంచాయతీలోని గిరిజన కాలనీలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జనసేన పార్టీ నాయకులు ఘనంగా పండుగ సంబరాలు నిర్వహించారు. పేట బ్రదర్స్ మిత్రబృందం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, పిల్లలకు పరిగెత్తు పందాలు, మ్యూజికల్ చైర్స్ వంటి వినోదాత్మక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ జనసేన పార్టీ నాయకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాలు గిరిజన కాలనీలోని చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరిలోనూ ఎంతో ఆనందాన్ని నింపాయి. పండుగను సమిష్టిగా జరుపుకోవడం వల్ల కాలనీలో ప్రత్యేక ఉత్సాహ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, తేజ, గంధం శీను, డాక్టర్ నక్క ప్రసాద్, మహేశ్, మనీ, మహర్షి రెడ్డి, భాను ప్రకాష్, కళ్లిపూడి వెంకటేష్, నవీన్, ముని చంద్ర, చందు, గోపి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అలాగే వీర మహిళ, శ్రీకాళహస్తి టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కవిత ప్రత్యేకంగా పాల్గొని మహిళలను ప్రోత్సహించారు. జనసేన పార్టీ చేపట్టిన ఈ సేవా కార్యక్రమాల పట్ల గిరిజన కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

# శ్రీకాళహస్తిలో ఫ్లెమింగో ఫెస్టివల్

## -: పాల్గొన్న మంత్రి, దేవస్థానం చైర్మన్

శ్రీకాళహస్తి, పెన్ పవర్ , జనవరి ,13 :
శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన ఫ్లెమింగో ఫెస్టివల్‌లో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ,పాల్గొని కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ ,కూడా హాజరై ఉత్సవానికి మరింత ప్రాధాన్యత తీసుకువచ్చారు. ఫ్లెమింగో పక్షుల సంరక్షణతో పాటు పర్యాటకాభివృద్ధి లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ ఫెస్టివల్ ప్రజల్లో ప్రకృతి ప్రేమను పెంపొందిస్తోందని నేతలు పేర్కొన్నారు. ప్రభుత్వ సహకారంతో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగితే శ్రీకాళహస్తి ప్రాంతం రాష్ట్ర స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.



# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

## -ప్రజలందరికీ భగవంతుడి ఆశీస్సులు అందాలి

## -ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



నెల్లూరు జనవరి 13.
తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి పండుగ ప్రజలందరికీ సుఖ శాంతులు కల్పించాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆకాంక్షించారు. భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినం సందర్భంగా జిల్లా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, పాడి పంటలు, భోగ భాగ్యాలతో తుల తూగాలని అన్నారు. ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లి విరియాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతోందని, కూటమి ప్రభుత్వానికి ఆ భగవంతుడి ఆశీస్సులు మెండుగా ఉండాలన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు

# ప్రజలందరికీ భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు..

## -ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి



నెల్లూరు జనవరి 13.
తెలుగు ప్రజలకు పెద్ద పండుగ, ప్రతి కుటుంబంలో సంతోషాన్ని నింపే నిండైన పండుగ సంక్రాంతి. అని వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఈ భోగి పండుగ ప్రజలందరికి భోగభాగ్యాలను అందించాలని.. మన తెలుగు జాతి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి పండుగ ప్రజలందరి కుటుంబాలలో అష్ట ఐశ్వర్యాలు, సుఖ.. సంతోషాలు, సకల సౌభాగ్యాలు కలుగజేయాలని..కోరుకుటూ ప్రజలందరూ.. సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరుకుంటూ.. ప్రజలందరికీ బోగి, సంక్రాంతి, కనుమ పండుగ శు భాకాంక్షలు,.ముఖ్యంగా నెల్లూరు నగర నియోజకవర్గ ప్రజలు ఈ పండుగలను మరింత శోభాయమానంగా జరుపుకోవాలని కోరుకుంటూ.. భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నాను.



# భక్తుల కష్టాలకు అండగా నిలిచిన ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్

## -తక్షణ చర్యలతో స్వర్ణముఖి నదిలో తర్పణాలకు సౌకర్యవంతమైన ఏర్పాట్లు



శ్రీకాళహస్తి, పెన్ పవర్, జనవరి ,13 :
శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ మరోసారి భక్తుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. పెద్ద పండుగ రోజున పెద్దలకు తర్పణం వదలడానికి వచ్చే భక్తులు రోడ్లపై ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని హిందూ ధార్మిక మండలి నాయకులు చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ పవిత్ర తర్పణ కార్యక్రమం రాఘవేంద్ర స్వామి దేవాలయం వెనుక వైపున ఉన్న స్వర్ణముఖి నదిలో ఏర్పాటు చేయాలని కోరగా, భక్తుల ఇబ్బందులను అర్థం చేసుకున్న చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే స్పందించారు. ఆదేశాలిచ్చిన వెంటనే స్వర్ణముఖి నది పరిసర ప్రాంతమంతా పరిశుభ్రత పనులు చేపట్టి, తర్పణాలు నిర్వహించేందుకు అవసరమైన సౌకర్యాలు, మార్గసౌలభ్యం కల్పించారు. భక్తులు శాంతియుతంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో తర్పణ కార్యక్రమాన్ని నిర్వహించుకునేలా దేవస్థానం చర్యలు తీసుకుంది. హిందూ సంప్రదాయాలు, ధార్మిక ఆచారాల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్న కొట్టే సాయి ప్రసాద్ నాయకత్వం భక్తుల్లో విశ్వాసాన్ని మరింత బలపరిచిందని హిందూ ధార్మిక మండలి సభ్యులు కొనియాడారు. భక్తుల కష్టాలను స్వయంగా తెలుసుకొని పరిష్కారం చూపిన చైర్మన్ మండలి సభ్యులు, పట్టణ ప్రజలు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణలో, భక్తుల సేవలో ముందుండే నాయకుడిగా కొట్టే సాయి ప్రసాద్ మరోసారి తన బాధ్యతను చాటుకున్నారని పలువురు అభిప్రాయపడ్డారు

# మంత్రి కందుల దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నాయకులు



గూడూరు, పెన్ పవర్,జనవరి,13:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ మరియు సినిమాటోగ్రఫీ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ కు గూడూరు నియోజకవర్గ జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. సూళ్లూరుపేటలో నిర్వహించిన ఫ్లెమింగో ఫెస్టివల్ కార్యక్రమానికి హాజరై తిరుగు ప్రయాణంలో గూడూరు రైల్వే జంక్షన్ వద్ద మంత్రి దుర్గేష్ ను గూడూరు నియోజకవర్గ చిరంజీవి యువత అధ్యక్షుడు, సీనియర్ జనసేన నాయకులు మరియు జనసేన పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ గూడూరు నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులు, ప్రజా సమస్యలపై నాయకులను ఆత్మీయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం జనసేన నాయకుడు సయ్యద్ నయుం మంత్రి దుర్గేష్ తో మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలోని శ్రీనివాససత్రం, తుపిలిపాలెం బీచ్ ను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని, అలాగే సర్వేపల్లి నియోజకవర్గంలోని కొత్తకోడూరు బీచ్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన మంత్రి కందుల దుర్గేష్ ఆయా ప్రాంతాలను తప్పకుండా పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే గూడూరు నియోజకవర్గానికి ప్రత్యేక పర్యటనకు వస్తానని కూడా తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసిన తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్.



తిరుపతి/పెన్ పవర్/జనవరి 13
తిరుపతి జిల్లా ప్రజలందరికీ మరియు జిల్లా పోలీస్ కుటుంబ సభ్యులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., తెలిపారు. సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, ఐక్యత నింపాలని ఆయన ఆకాంక్షించారు. భోగి పండుగ భోగభాగ్యాలను, సంక్రాంతి పండుగ ఆనందోత్సాహాలను, కనుమ పండుగ కమ్మని కనువిందులను అందించాలని హృదయపూర్వకంగా కోరుకున్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాల పరిమళం వెదజల్లేలా ఈ భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల నడుమ సుహృద్భావ వాతావరణంలో, ఆనందంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ గారు పిలుపునిచ్చారు

# భార్యాభర్తల నిజాయితీని మెచ్చుకున్న ఎస్ఐ స్వర్ణతేజ

పలమనేరు,పెన్ పవర్, జనవరి 13,
పోగొట్టుకున్న విలువైన వస్తువుల బ్యాగును తెచ్చిఇచ్చిన ఆ భార్యాభర్తల నిజాయితీని పలమనేరు ఎస్.ఐ.స్వర్ణతేజ మెచ్చుకొన్నారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని చిత్తూరు, బెంగళూరు జాతీయ రహదారి రోడ్డు నాగమంగళం ఫ్లైఓవర్ కింద టీతాగి ఆటో కోసం వేచి చూస్తున్న అదే గ్రామానికి చెందిన శంకరమ్మ,విజయ్ కుమార్ దంపతులకు అక్కడ ఒక హ్యాండ్ బ్యాగ్ దొరికింది. దానిని తెరిచిచూడగా అందులో 2 సెల్ ఫోన్లు మరియు 8వేల రూపాయల డబ్బులు ఉన్నాయి. వెంటనే ఆ దంపతులు బ్యాగ్ తీసుకొని వచ్చి పలమనేరు పోలీసు స్టేషన్లో అప్పగించారు. దీంతో పోలీసులు బాధితులను పిలిపించి ఆ బ్యాగును అప్పగించడం జరిగిందని రూరల్ ఎస్.ఐ.స్వర్ణతేజ తెలిపారు. హ్యాండ్ బ్యాగ్ అప్పగించిన దంపతులను పోలీసులు మరియు బాధితులు అభినందించారు.



# తిరుమలలో లగేజీ కౌంటర్ తరహాలో పాద రక్షల కౌంటర్లు

--పాద రక్షలు నిర్వహణకుఞు= కోడ్ ఆధారిత ఆధునిక వ్యవస్థ-టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి.







తిరుమల/పెన్ పవర్/జనవరి 13

తిరుమలలో లగేజీ కౌంటర్ల తరహాలోఞు= ఆధారిత పాద రక్షల నిర్వహణ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలియజేశారు. తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రం వద్ద మంగళవారం ఉదయం ఆయన నూతనంగా ఏర్పాటు చేసినఞు= కోడ్ ఆధారిత పాద రక్షలు కౌంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మీడియాతో మాట్లాడుతూ తిరుమల కొండపై భక్తులు ఎదుర్కొంటున్న పాద రక్షల నిర్వహణ సమస్యకు శాశ్వత పరిష్కారంగా టీటీడీ ఞు= కోడ్ ఆధారిత ఆధునిక పాద రక్షల నిర్వహణ వ్యవస్థను విజయవంతంగా అమలు చేస్తోందని వెల్లడించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్2 వద్ద పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ఈ విధానం అద్భుత ఫలితాలు ఇవ్వడంతో, తిరుమలలోని పలు ప్రాంతాల్లో ఎనిమిది కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ విధానంలో భక్తులు తమ పాద రక్షలను కౌంటర్ వద్ద అప్పగించగానే వారికి ఞు= కోడ్‌తో కూడిన స్లిప్ ఇస్తారని, ఆ స్లిప్‌లో పాద రక్షల సంఖ్య, సైజు, ర్యాక్ నంబర్, బాక్స్ నంబర్, నిల్వ చేసిన స్థానం వంటి పూర్తి వివరాలు ఉంటాయని తెలిపారు. భక్తులు తిరిగి వచ్చి ఆ స్లిప్‌ను స్కాన్ చేయగానే పాద రక్షలు ఉన్న ఖచ్చితమైన స్థానం డిస్‌ప్లే అవుతుందని, తద్వారా అతి తక్కువ సమయంలోనే భక్తులకు పాద రక్షలు తిరిగి అందజేయడం జరుగుతోందని అదనపు ఈవో తెలిపారు. ఈ వ్యవస్థ అమలుతో ఇప్పుడు దాదాపు 99 శాతం భక్తులు తమ పాద రక్షలను తిరిగి పొందుతున్నారని, గతంలో గుట్టలుగా పడిపోవడం వల్ల సుమారు 7080 శాతం మంది భక్తులు పాద రక్షలు వదిలేసి వెళ్లే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ సమస్య పూర్తిగా తొలగిపోయిందన్నారు. ఈ వినూత్న ప్రాజెక్టును కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ తమ జూ= కార్యక్రమంలో భాగంగా పూర్తి స్థాయిలో అమలు చేస్తోందని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యం, తిరుమల స్వచ్ఛత దృష్ట్యా ఇది దేశంలోనే ఆలయ పరిపాలనలో ఒక అత్యుత్తమ వ్యవస్థగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులు తమ పాద రక్షలను ఎక్కడ పడితే అక్కడ వదలకుండా, నిర్దేశిత కౌంటర్లలోనే డిపాజిట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా తిరుమల పరిశుభ్రత మరింత మెరుగుపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.సత్య నారాయణ, ఇతర టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

**- ప్రజల ఆరోగ్య భద్రతకు చంద్రబాబు ప్రాధాన్యం- నియోజకవర్గానికి అత్యధికంగా సీఎంఆర్ ఎఫ్ చెక్కులు**

**-ఇప్పటివరకు 975 మందికి 7.8 కోట్లు పంపిణీ-తాజాగా 55 మందికి 59 లక్షలు విడుదల**





కందుకూరు, పెన్ పవర్,జనవరి,13:

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంతోపాటు ప్రజల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా కందుకూరు నియోజక వర్గానికి అధికంగా నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. 55 మంది పేదలకు 59.05 లక్షల రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను, స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే మంగళవారం అందజేశారు.

ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఇప్పటివరకు కందుకూరు నియోజకవర్గంలో 975 మందికి 7.8 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరిగిందని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంలో సీఎంఆర్‌ఎఫ్ అనేది అందని ద్రాక్షలా ఉండేదని, ఒకరికో ఇద్దరికో మాత్రమే సహాయం చేసి, ప్రచారం మాత్రం గొప్పగా చేసుకున్నారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు విమర్శించారు. కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి సహాయం అందిస్తున్నారని చెప్పారు. ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే, లక్షలకు లక్షల ఖర్చు చేసే ఆర్థిక స్థోమత పేదలకు ఉండదని, అలాంటివారికి ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం చేయాలన్న గొప్ప ఆలోచనతో ముఖ్యమంత్రి ముందుకు వెళుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సహాయం అందుకున్న వారందరూ ముఖ్యమంత్రికి మరియు యువ నాయకులు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుకి రుణపడి ఉంటారని తెలిపారు.

**లబ్ధిదారులు వివరములు**

వలేటివారిపాలెం మండలం 21 మంది లబ్ధిదారులు 17.08 లక్షలు ,

కందుకూరు మండలం 15 మంది లబ్ధిదారులు 25.19 లక్షలు,

కందుకూరు పట్టణం 19 మంది లబ్ధిదారులు 16.77 లక్షలు

మొత్తం 55 మంది లబ్ధిదారులు 59.05 లక్షలు . ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల టిడిపి అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, వలేటివారిపాలెం మండలం టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ నాయకులు చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, షేక్ రూబీ, నాదెళ్ల వెంకట రమణయ్య, నియోజకవర్గ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక పాల్గొన్నారు.



## వాకచర్ల గుర్రప్ప శెట్టికి రాష్ట్రస్థాయి గౌరవం



శ్రీకాళహస్తి, పెన్ పవర్, జనవరి, 13 :

శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులు వాకచర్ల గుర్రప్ప శెట్టి శ్రీ వాసవి సేవా సమితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితులుగా నియమిస్తున్నట్లు శ్రీ వాసవి సేవా సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పూరి సురేష్ శెట్టి తెలిపారు. సమాజ సేవ, ధార్మిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల్లో వాకచర్ల గుర్రప్ప శెట్టి సేవలను గుర్తించి ఈ నియామకం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. శ్రీ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలకు గుర్రప్ప శెట్టి అనుభవం, మార్గదర్శనం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు ఈ నియామకం దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వాకచర్ల గుర్రప్ప శెట్టి నియామకంపై పలువురు అభినందనలు తెలియజేశారు.

## భద్రతే లక్ష్యం భోగి, సంక్రాంతి పండుగల్లో జాగ్రత్తలు పాటించండి : డిఎస్పీ గీత కుమారి



గూడూరు, పెన్ పవర్,జనవరి,13:

గూడూరు సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలందరికీ భోగిసంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు డిఎస్పీ గీతా కుమారి తెలిపారు. పండుగల సందర్భంగా ప్రజలు ఆనందంగా పండుగలు జరుపుకోవాలని, అదే సమయంలో భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని ఆమె సూచించారు. చిన్నారులు గాలిపటాలు ఎగురవేసేటప్పుడు పైన ఉన్న కరెంటు వైర్లను గమనించి జాగ్రత్తగా ఎగురవేయాలని, తప్పనిసరిగా పెద్దల పర్యవేక్షణలోనే ఉండాలని తెలిపారు. పండుగలకు సొంత గ్రామాలకు లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఇళ్లలో విలువైన ఆభరణాలు ఉంచవద్దని, సమీప పోలీస్ స్టేషన్‌కు ముందుగా సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందితే దొంగతనాలు జరగకుండా ఇంటిపై పోలీసుల నిఘా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. భోగిమంటల పేరుతో ఆకతాయిలు ఇతరుల ఆస్తులను ధ్వంసం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెల్లవారుజామున మహిళలు ముగ్గులు వేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోడి పందాలు నిర్వహించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అలాగే ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. అందరూ భద్రతా నియమాలు పాటిస్తూ ఆనందంగా భోగిసంక్రాంతి పండుగను జరుపుకోవాలని డిఎస్పీ గీతా కుమారి కోరారు.

## ప్రింట్ మీడియా ప్రతినిధులకు పొనకా దంపతుల సంక్రాంతి శుభాకాంక్షలు





గూడూరు, పెన్ పవర్,జనవరి,13:

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న పత్రికా విలేకరులు సంక్రాంతి పండుగ సందర్భంగా తమను కలిసి శుభాకాంక్షలు తెలపడం ఎంతో ఆనందంగా ఉందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, ప్రముఖ పారిశ్రామిక వేత్త పొనకా శివకుమార్ రెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలోని స్థానిక కరణాల వీధిలో ఉన్న పీ.ఎస్సార్ నివాసంలో గూడూరు ప్రింట్ మీడియా ప్రతినిధులు పొనకా దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సరము మరియు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలను తెలియజేశారు. విలేకరులతో కొద్దిసేపు ముచ్చటించిన పొనకా దంపతులు, మీడియా ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తోందని, ప్రజల గొంతుకగా నిలుస్తోందని అభినందించారు. అనంతరం వచ్చిన ప్రింట్ మీడియా ప్రతినిధులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ మీడియా ప్రతినిధులు జమాల్, శివప్రసాద్, శరత్, మనోహర్ రెడ్డి, సురేష్, కిషోర్, నాని మంగళ్పూర్ శ్రీనివాసులు, నిరంజన్, నర్సింహారావు, కోటి తదితరులు పాల్గొన్నారు.

## కందుకూరు నియోజకవర్గ ప్రజలందరికీ భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ఇంటూరి



కందుకూరు, పెన్ పవర్,జనవరి,13:

పవిత్రమైన ఈ భోగి పండుగ మీకు, మీ కుటుంబానికి సరికొత్త వెలుగులు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు తెలిపారు. మీ కష్టాలు, బాధలు భోగిమంటల్లో పోవాలి. కొత్త ఆనందాలు, సంతోషాలు వెల్లివిరియాలి. భోగభాగ్యాల భోగి పండుగను మీ కుటుంబ సభ్యులంతా సంతోషంగా జరుపుకోవాలని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆశిస్తున్నారు.

# టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే మీడియా సమావేశం

**-నా దృష్టి కేవలం అభివృద్ధి పైనే- చిన్న తప్పులను భూతద్దంలో చూపించడం తగదు**

**ప్రజలకోసం 24 గంటలూ పనిచేస్తా- చెరువుల రిపేర్లకు 9 కోట్లు మంజూరు**

**- మున్సిపాలిటీకి మరో 5 కోట్లు మంజూరు - సీఎంఆర్ఎఫ్ ద్వారా 975 మందికి 7.8 కోట్ల ఆర్థిక సహాయం**



కందుకూరు, , పెన్ పవర్,జనవరి,13: కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను 24 గంటలు పని చేస్తున్నానని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు 300 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్లుగా నియోజకవర్గంలో రోడ్లను గుంతలు లేకుండా 90 శాతం తీర్చిదిద్దామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు లాంటి హామీలన్నీ నెరవేర్చినట్లు చెప్పారు.

నియోజకవర్గంలో పేదల ఆరోగ్యం కోసం ఇప్పటివరకు 975 మందికి 7.8 కోట్ల ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయాలు అందించామని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కందుకూరు పర్యటనకు వచ్చి వెళ్ళగానే, పట్టణ అభివృద్ధి కోసం 5 కోట్ల రూపాయలు మంజూరు చేశారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఇప్పటివరకు మునిసిపాలిటీ అభివృద్ధికి 25 కోట్లు నిధులు వచ్చినట్లు తెలిపారు. అలాగే గతంలో దిత్వా, మంతా తుఫాను వల్ల దెబ్బతిన్న చెరువుల రిపేర్లకు 9 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. రాళ్లపాడు రిజర్వాయర్ పైన కొత్తగా తారు రోడ్డు నిర్మాణం, ఇతర పనుల కోసం 1.06 కోట్లు తాజాగా మంజూరయ్యాయని చెప్పారు. అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకులు నారా లోకేష్, ఆయా శాఖల మంత్రులకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఇంత పెద్ద ఎత్తున జరుగుతున్న సమయంలో, అక్కడక్కడ చిన్న చిన్న పొరపాట్లు జరగడం సహజమేనని, వాటిని భూతద్దంలో చూపించడం తగదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం తనకు సూచనలు సలహాలు అందించాలని మీడియా ప్రతినిధులకు ఆయన విజ్ఞప్తి చేశారు. వాటన్నిటిని కచ్చితంగా పరిశీలించి ప్రజల కోసం ఆచరణలో పెడతానని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల టిడిపి అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, వలేటివారిపాలెం మండలం టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ నాయకులు చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, షేక్ రూబీ, నాదెళ్ల వెంకట రమణయ్య, నియోజకవర్గ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక పాల్గొన్నారు

## శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయం నిర్మాణం కోసం 10వేల రూపాయలు విరాళం



గుడ్లూరు, , పెన్ పవర్,జనవరి,13:
గుడ్లూరు మండలం చెమిడిదపాడు గ్రామ బస్టాండు వద్ద నిర్మాణంలో ఉన్న శ్రీ రామ భక్త భవిష్యత్తు బ్రహ్మ శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయం నిర్మాణం కోసం హైదరాబాద్ రంగారెడ్డి జిల్లా కోర్టు రిటైర్డ్ జడ్జి గొట్టిముక్కల వెంకట కృష్ణంరాజు, రమాదేవి, మనవడు ఉప్పలపాటి అక్షయ వర్మ మంగళవారం సాయంత్రం ఆలయ నిర్మాణ ప్రాంగణం వద్ద ట్రస్ట్ అధ్యక్షులు ఆలూరి వెంకట హనుమంతరావు కు 10 వేల రూపాయలు విరాళం అందించారు. కుటుంబ సభ్యులతో కలిసి నిర్మాణ ప్రాంగణం వద్దకు వచ్చిన వారికి హనుమంతరావు సాదరంగా స్వాగతం పలికి శ్రీ ఆంజనేయ స్వామి వారి అష్టోత్తర శతనామావళి పూజ సింధూరంతో చేయించారు. అనంతరం స్వామివారి సింధూరం, శేష వస్త్రాలను కృష్ణంరాజు కుటుంబ సభ్యులకు అందించారు. గతంలో కృష్ణంరాజు రమాదేవి దంపతులు ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయలు విరాళం అందించిన విషయం తెలిసిందే. భక్తులకు కొంగు బంగారంగా ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆశీస్సులు వారికి ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ ట్రస్ట్ తరపున హనుమంతరావు కృతజ్ఞతలు తెలిపారు.

## రెండు మోటర్ సైకిళ్ళు ఢీకొని ముగ్గురికి గాయాలు

గుడ్లూరు, , పెన్ పవర్,జనవరి,13: రెండు మోటార్ సైకిళ్ళు ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని పొట్లూరు సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం జరిగింది. గుడ్లూరు కి చెందిన కోర్సిపాటి రామచంద్రారెడ్డి దంపతులు మోటార్ సైకిల్ పై వెళ్తూ పెట్రోల్ బంకులో ఆయిల్ కొట్టించుకుని రోడ్డుపైకి రాగా తెట్టు నుంచి గుడ్లూరు వైపు వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొట్టింది దీంతో రామచంద్రా రెడ్డికి తలకు, కాళ్లకు గాయాలు కా మరో మోటార్ సైకిల్ పైఉన్న మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ రామచంద్రారెడ్డిని కావలి వైద్యశాలకు తరలించారు.

## వాసవి వనిత క్లబ్ లెజండ్స్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

కావలి, , పెన్ పవర్,జనవరి,13:
జై వాసవి జై జై వాసవి, క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్ కింద 2026వ సంవత్సరం ముగ్గులు పోటీ కావలిలో ఉన్న వాసవి కన్యకా పరమేశ్వరి ప్రాంగణంలోనిర్వహించచడ మైనది .2026 ప్రెసిడెంట్ పానుగంటి జ్యోతి ,సెక్రటరీ పెట్టుగాని సుధారాణి, ట్రెజరర్ తాత శైలజ, ఆధ్వర్యంలో ఈ ముగ్గుల పోటీ నిర్వహించచడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐపీసీ ఆఫీసర్ అనుమాల శెట్టి కామాక్షి , జెడ్ సి దుగ్గిసెట్టి హేమలత లను జడ్జెస్ గా పార్వతీశంకర్ మేడం, స్వర్ణలతా మేడం ని పిలవడం జరిగింది. ఈ ముగ్గుల పోటీలో అందరూ మహిళా మణులు చాలా అందంగా రంగవల్లులు దిద్దారు వచ్చిన వారిలో ఫస్ట్ ప్రైజ్ 1000 సెకండ్ ప్రైజ్ 750 థర్డ్ ప్రైజ్ 500 రూపాయలు అలాగే ఒక 5 మందికి కన్సోలేషన్ ప్రైజెస్, పోటీలో పాల్గొన్నప్రతి ఒక్కరికి గిఫ్ట్స్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో పానుగంటి వెంకటేశ్వర్లు,శబరీష్,వైస్ ప్రెసిడెంట్ బొగ్గరపుశ్రీలక్ష్మి, శనగపల్లి గీతదేవి,దుర్గా లక్ష్మి, జాయింట్ సెక్రటరీ అమరా కామాక్షి, శ్రీలేఖ,శ్రావణి, సులోచన తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం కీ విచ్చేసి జయప్రదం చేసిన ప్రతి ఒక్క లెజండ్స్ మరియు మహిళా మణులకు ధన్యవాదములు తెలియజేసారు.

## నియోజకవర్గ ప్రజలందరికీ ముందస్తుగా సంక్రాంతి శుభాకాంక్షలు

**-వైయస్ఆర్సీపీ కనిగిరి ఇంచార్జి దద్దాల**

కనిగిరి టౌన్,, పెన్ పవర్,జనవరి,13:
కనిగిరి నియోజకవర్గం ప్రజలందరికీ ముందస్తుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు వైయస్ఆర్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.. తెలుగువారి సంస్కృతి,సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా సంక్రాంతి వేడుకల ను అన్ని వర్గాల ప్రజలు ఈ నూతన సంవత్సరంలో సంతోషంగా జరుపుకోవాలన్నారు..ప్రతి ఇంటా భోగభాగ్యాలు కలగాలని,పాడి పంటలు అభివృద్ధి చెందాలని, అందరూ ఆయురారోగ్యాలను, సుఖసంతోషాలను అందించాలని,ప్రతి ఇంట సిరిసంపదలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు..భోగి, సంక్రాంతి,కనుమ పండుగలను అందరూ కుటుంబ సమేతంగా ఆనందోత్సవాలతో, సంతోషంగా జరుపుకోవాలన్నారు.

## ప్రతి పౌరుడు రహదారి భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలి: ఆర్టీవో నాగలక్ష్మి

కందుకూరు, , పెన్ పవర్,జనవరి,13:
37వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా మంగళవారం ఆర్టీవో టీవీ నాగలక్ష్మి ఆధ్వర్యంలో కందుకూరు పట్టణంలో మార్కెట్ యార్డ్ నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆర్టీవో టీవీ నాగలక్ష్మి మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగిందని ప్రతి ఒక్క పౌరుడు రహదారి భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని అదేవిధంగా టు వీలర్ డ్రైవ్ చేయువారు హెల్మెట్ ధరించి మాత్రమే వాహనం నడపాలని మోటర్ కారు నడుపువారు సీట్ బెల్ట్ ధరించి వాహనం నడుపవలెనని, తమ ప్రాణాలను మరియు ఇతరుల ప్రాణములను విలువైనవిగా భావించి బాధ్యతాయుతంగా వాహనం నడపాలని తెలియజేశారు, రహదారి భద్రత నియమాలు తూచా తప్పకుండా పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఎంవిఐ అనిల్ కుమార్ మాట్లాడుతూ గడిచిన నాలుగైదు నెలల కాలంలోనే దాదాపు 20 నుండి 30 యాక్సిడెంట్లు జరిగాయని అందులో కేవలం మోటార్ సైకిల్ పై వెళ్తున్న వారు మాత్రమే ఎక్కువగా చనిపోవడం జరిగిందని కావున ప్రతి ఒక్కరు రహదారి పట్ల అవగాహన కలిగి ఉండి రహదారి భద్రతను పాటించి ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరు రూరల్ ఎస్సై సి హెచ్ రాము మాట్లాడుతూ ట్రిపుల్ రైడ్ చేయరాదని హెల్మెట్ ధరించి వాహనం నడుపులని అదేవిధంగా మద్యం సేవించి వాహనం నడపరాదని వేగపరిమితులను పాటించడం సిగ్నల్ జంపింగ్ నివారించడం మరియు లేన్ క్రమశిక్షణను నిర్వహించడం గురించి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కందుకూరు రూరల్ ఎ.ఎస్ఐ కె శ్రీనివాసులు, రవాణా శాఖ ఏవో కె శివ ప్రసాద్ మరియు రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా వివేకానంద జయంతి

సిర్గాపూర్, పెన్ పవర్,జనవరి,13:
సిర్గాపూర్ మండలంలో వివేకా నంద జయంతి సందర్భంగా వివేకా నందుడి విగ్రహానికి పూల మాల వేసి జయంతిని ఘనంగా నిర్వహించారు.వివేకా నందుని ఆశయాలను యువత ప్రతి ఒక్కరు పాటించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో వివేకానంద విగ్రహ ధాత బీజేపీ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అరుణ్‌రాజ్ శేరికార్ , స్థానిక సర్పంచ్ శ్రీనివాస్ పటేల్ మరియు సిర్గాపూర్ మండలానికి చెందిన సర్పంచ్ లు , ఉప సర్పంచ్ లు పార్టీ లకు అతితంగా ముఖ్య నాయకులందరూ హాజరైనారు .

## ఘనంగా స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలు.

పుల్కల్ , పెన్ పవర్,జనవరి,13:
యువజన స్ఫూర్తి ప్రదాత యువతకు ఆదర్శప్రాయుడు స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలను ముదిమాణిక్యం గ్రామంలో గ్రామ సర్పంచ్ పడమటి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతను జాగృతం చేసిన స్వామీ వివేకానంద గారి ఆలోచనలు, ఆదర్శాలు నేటికీ దేశ యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. వారు చూపిన విలువల బాటలో నడుచుకుంటూ, దేశ నిర్మాణంలో యువశక్తి కీలక పాత్ర పోషిస్తూ, మరింత బలంగా ముందుకు సాగాలి అని పేర్కొన్నారు.అలాగే ఈ కార్యక్రమం లో పాల్గొన్న పుర దుర్గయ్య, ఇందూరి మోహన్ మాట్లాడుతూ మా స్వామి వివేకానంద విగ్రహని ఇద్దరు కలసి సమిష్టిగా ఇప్పిస్తాం అని మాట ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డ్ మెంబెర్స్ గ్రామ పెద్దలు, యువజన సంఘాల నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని అంగన్వాడీ టీచర్ కు మెమో జారీ

రాయికోడ్ , పెన్ పవర్,జనవరి,13:
సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల పరిధిలోని పీపాడ్ పల్లి గ్రామం లోని మొదటి అంగన్వాడీ సెంటర్ ను సోమవారం నాడు జహీరాబాద్ సీడీపీఓ సందర్శించి అంగన్వాడీ టీచర్ పై ఈ నెల 7వ తేదీన పలు పత్రికలలో ఆమెపై ఆరోపణలపై విచారణ జరిపారు.అంగన్వాడీ పిల్లల తల్లిదండ్రులు, బాలింతలు, గర్భిణీ స్త్రీలతో, గ్రామస్థులతో చర్చించి నిజ నిజాలు తెలుసుకొని, అంగన్వాడీ టీచర్ పిల్లల తల్లి దండ్రులతో దురుసుగా మాట్లాడటంమరియు సమయ పాలన పాటించడం లేదని తెలుసుకొని ఆమెకు మెమో జారి చేయడం జరిగింది. దీనికి మూడు రోజులలో సరైన సమాధానం ఇవ్వాలని అన్నారు లేనిచో షోకాజ్ నోటీసులు జారి చేస్తామని హెచ్చరించారు.ఇకనుండి అయిన అంగన్వాడీ కేంద్రలోని అందరితో సరిగ్గా నడుచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామస్తులు పెద్దలు, తదితరులు పాల్గొన్నారు



## మొక్కలతో సంక్రాంతి చిత్రాలతో కూర్పు.

కడియం, పెన్ పవర్,జనవరి,13:
కడియం మండలం కడియపులంక గ్రామంలో గల పల్ల వెంకన్న నర్సరీలో సంక్రాంతి పండుగను సందర్భంగా ప్రత్యేక మొక్కలతో ఏర్పాటు చేసిన చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి . విరి వనంలో సంక్రాంతి శోభను ప్రతిబింబించేలా భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాల ప్రత్యేకతను మొక్కలతో రూపుదిద్దారు .ఈ చిత్రాలలో భోగి మంటలో పొంగుతున్న పాల కుండ, పతంగి, ఎద్దు, కోడిపుంజు వంటి పండుగకు ప్రతీకలైన అంశాలను సృజనాత్మకంగా మొక్కలతో తీర్చిదిద్దారు.అలానే చివరలో హ్యాపీ పొంగల్ అంటూ శుభాకాంక్షల సందేశాన్ని వెలిబుచ్చడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ వినూత్న రూపకల్పనను పల్ల వెంకన్న నర్సరీ అధినేత పల్ల సత్యనారాయణ మూర్తి (సత్తిబాబు) కుమారులు, యువ రైతులు పల్ల వెంకటేష్, పల్ల వినయ్ కుమార్ రూపొందించారు. సంప్రదాయ పండుగ సంస్కృతిని పర్యావరణహితంగా ప్రజలకు చేరువ చేయాలన్న ఉద్దేశంతో ఈ ప్రయత్నం చేశామని వారు తెలిపారు. నర్సరీని సందర్శించేవారు ఫోటోలు తీసుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.




## పట్లోళ్ల కమలమ్మ వర్ధంతి సందర్భంగా రగ్గుల పంపిణీ

అందోల్), పెన్ పవర్,జనవరి,13:
ఆందోల్ మండలం నేరడిగుంట గ్రామానికి చెందిన పట్లోళ్ల కమలమ్మ మొదటి వర్దంతి సందర్భంగా స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అన్న సంతర్పణ చేసి గ్రామ ప్రజలకు కమలమ్మ భర్త పట్లోళ్ల (శెట్టి) గంగాధర్ మరియు కుటుంబ సభ్యుల చేతుల మీదుగా రగ్గుల పంపిణీ చేశారు.గత కొన్ని సంవత్సరాలుగా సదాశివపేట లో నివాసం ఉంటున్న గ్రామ ప్రజల మన్నన మరవలేమని వారికి ఎంత సేవ చేసిన తక్కువేనని అందు కోసం మా అమ్మగారి ఆత్మ మొత్తం నేరడిగుంట గ్రామం గ్రామ ప్రజల మీదనే ఉంటుందని ఆమె ఆత్మ శాంతి కోసం గ్రామ ప్రజలకు చిన్న సహాయంగా చలికాలం కాబట్టి గ్రామ ప్రజలకు సహాయకరంగా ఉంటుందని అమ్మ జ్ఞాపకార్థం రగ్గులు పంపిణీ చేయడం జరిగిందని కమలమ్మ కుమారుడు ప్రేమ్ సాగర్ పెన్ గన్ న్యూస్ తో మాట్లాడుతూ అన్నారు.కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం లాంటిది : నగేష్ షెట్కర్

నారాయణఖేడ్:), పెన్ పవర్,జనవరి,13:
సీఎంఆర్ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయ నిధి) నిరుపేదలకు వరం లాంటిదని, అర్హులైన వారు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కర్ అన్నారు.సోమవారం నారాయణఖేడ్‌లోని ఆయన స్వగృహంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు నగేష్ షెట్కర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు.రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని, నారాయణఖేడ్ మున్సిపల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం తప్పదని ఆయన ధీమా వ్యక్తం చేశారు

## వాలీబాల్ టౌర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధిగా సీఐ అనిల్ కుమార్

అందోల్), పెన్ పవర్,జనవరి,13:ఆందోల్ మండలం నేరడిగుంట గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా 13,14 న పట్లోళ్ల రాజు (వైద్యనాథ్) ఆధ్వర్యంలో నిర్వహించే వాలీబాల్ టౌర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా సీఐ అనిల్ కుమార్ జోగిపేట్ ఎస్సై పాండు మరియు ఎస్సై లు శ్రీదర్ రెడ్డి,లవకుమార్,లు హాజరౌతున్నట్లు యువసజన నాయకుడు మిద్దెల శ్రీదర్ రెడ్డి తెలిపారు. ఇట్టి కార్యక్రమాన్ని గ్రామంలోని అందరూ క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని ప్రతీ ఒక టీం కి క్యాప్టెన్ ను ఎన్నుకొని నిర్వాహకులు విజయ్,నర్సింహులు, శంకర్,శేఖర్ లను సంప్రదించాలని ఉదయం 8 గంటలకు అన్ని టీం ల క్యాప్టెన్ లు ఉండాలని 11 టౌర్నమెంట్ ప్రారంభం అవుతుందని తెలిపారు.దయచేసి ప్రతీ ఒక్కరు పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటి విజయవంతం చేయాలని అలాగే యువకులు అడిగిన వెంటనే టౌర్నమెంట్ నిర్వహణకు ఒకే చెప్పినందుకు పట్లోళ్ల రాజు కి అభినందనలు తెలిపిన శ్రీదర్ రెడ్డి.

# టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి మేలు చేసే పండు

జీవనశైలిలో, ఆహారపు అలవాట్లల్లో వచ్చిన మార్పులే ఈ సమస్య బారిన పడడానికి ప్రధాన కారణాలు అని చెప్పవచ్చు. డయాబెటిస్ కారణంగా మొత్తం శరీర ఆరోగ్యం దెబ్బతింటుంది. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు చేసే పండు ఇది.. రోజూ తినాలి..!

ఎజూవ 2 ఆతిజీఎవబివబ । టైప్ 2 డయాబెటిస్ తో బాధపడే వారు రోజురోజుకీ పెరుగుతున్నారు. జీవనశైలిలో, ఆహారపు అలవాట్లల్లో వచ్చిన మార్పులే ఈ సమస్య బారిన పడడానికి ప్రధాన కారణాలు అని చెప్పవచ్చు. డయాబెటిస్ కారణంగా మొత్తం శరీర ఆరోగ్యం దెబ్బతింటుంది. కనుక డయాబెటిస్ ను అదుపులో ఉంచుకోవడం చాలా ముఖ్యం. సరైన జీవన శైలితో పాటు డయాబెటిస్ ను అదుపులో ఉంచే ఆహారాలను తీసుకోవడం వల్ల టైప్ 2 డయాబెటిస్ ను మనం అదుపులో ఉంచుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. మనం తీసుకునే ఆహారాలే డయాబెటిస్ నిర్వహణలో ముఖ్య పాత్ర పోషిస్తాయని వారు తెలియజేస్తున్నారు. టైప్ 2 డయాబెటిస్ ఉన్న వారు తమ అల్పాహారంలో భాగంగా అవకాడోను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. టైప్ 2 డయాబెటిస్ తో బాధపడే వారు అల్పాహారంలో భాగంగా అవకాడోను తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వైద్యులు వివరిస్తున్నారు.



**ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు..**

అవకాడోలో మన ఆరోగ్యానికి మేలు చేసే కొవ్వులు, ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. కార్బొహైడ్రేట్స్ తక్కువగా ఉంటాయి. 150 గ్రాముల అవకాడోలో 22 గ్రాముల కొవ్వులు, 10.1 గ్రాముల ఫైబర్ ఉంటుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా ఉంటాయి. అవకాడోను తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సమయం ఆకలి అవ్వకుండా ఉంటుంది. అలాగే అవకాడోలో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఇవి ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో సహాయపడతాయి. అదే విధంగా అవకాడోలో పొటాషియం అధికంగా ఉంటుంది. డయాబెటిస్ మాత్రమే కాకుండా అధిక రక్తపోటుతో బాధపడే వారు దీనిని తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. అవకాడోను తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. దీంతో గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఈ విధంగా డయాబెటిస్ తో బాధపడే వారికి అవకాడో ఎంతో మేలు చేస్తుంది.

**ఇతర ఆహారాలు కూడా..**

ఇక అవకాడోలు మాత్రమే కాకుండా రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచే ఇతర ఆహారాలను కూడా డయాబెటిస్ తో బాధపడే వారు తీసుకోవచ్చు. టైప్ 2 డయాబెటిస్ తో బాధపడే వారు తక్కువ కార్బొహైడ్రేట్స్, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న ఆహారాలను తీసుకోవాలి. బ్రౌన్ రైస్, తృణ ధాన్యాలు, ఓట్ మీల్స్, తాజా పండ్లు, కూరగాయలు, చిక్కుళ్లు, గింజలు వంటి ఆహారాలను తీసుకోవాలి. అలాగే డయాబెటిస్ తో బాధపడే వారు కొన్ని ఆహారాలను ఎల్లప్పుడూ దూరంగా ఉండాలి. వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉంది. చక్కెర పానీయాలు, మద్యం, వేయించిన ఆహారాలు, కార్బొనేటెడ్ పానీయాలు, జంక్ ఫుడ్, ప్రాసెస్డ్, ప్యాక్ చేసిన ఆహారాలు, తీపి పదార్థాలు, మైదాతో చేసిన ఆహారాలు వంటి వాటికి దూరంగా ఉండాలి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెంచుతాయి. ఈ విధంగా తగిన ఆహారాలు తీసుకుంటూ చక్కటి జీవనశైలిని పాటించడం వల్ల టైప్ 2 డయాబెటిస్ ను అదుపులో ఉంచుకోవచ్చు. తద్వారా శరీర మొత్తం ఆరోగ్యం దెబ్బతినకుండా కాపాడుకోవచ్చు.

# వంటలో 'బహుమతి

**హైదరాబాద్ పెన్ పవర్:** అనగనగా ఒక రాజు. ఆ రాజుకు షష్ఠిపూర్తి ఉత్సవం రంగరంగ వైభవంగా జరిగింది. ఈ ఉత్సవంలో రాజు "వచ్చే ఆదివారం నేనొక ప్రశ్న వేస్తాను. దానికి జవాబు చెప్పినవారికి వెయ్యి బంగారు కాసులు ఇస్తాను. కొలువులో ఉద్యోగం కూడా ఇస్తాను" అని ఒక ప్రకటన చేశాడు. మహారాజు ఏం ప్రశ్న వేస్తాడో, ఏమో, జవాబు చెప్పగల అదృష్టవంతులెవరో అని చర్చ ప్రారంభమైంది. జనం ఇదే మాట్లాడుకోసాగారు. ఇక పండితులు, మేధావులు సరేసరి. తమ అదృష్టాన్ని, తెలివిని పరీక్షించుకుందామని తహతహలాడసాగారు. కొందరైతే శాస్త్రాలు తిరగెయ్యసాగారు. అలా అలా ఈ వార్త గ్రామాల్లోకి పాకింది. ఒక రైతు కూతురు వెన్నెల అనే అమ్మాయి చెవిలో కూడా ఈ వార్త పడింది. వెన్నెల చాలా తెలివైన పిల్ల. తల్లిదండ్రులు అల్లారు ముద్దుగా పెంచుతున్నారు. తను కూడా రాజధానికి వెళతానని వెన్నెల మారాం చేసింది. అమ్మా నాన్నా వొప్పుకొన్నారు.ఆదివారం రానే వచ్చింది. జనం తండోపతండాలుగా రాజధానికి చేరుకొన్నారు. పండితులు, విద్యావేత్తలు, ఎక్కడెక్కడి నుంచో శాస్త్రాలు పట్టుకొని బయలుదేరి వచ్చారు. వెన్నెల కూడా వాళ్లమ్మా నాన్నలతో పాటు వచ్చింది. జనం కిటకిటలాడుతున్నారు. అయినా చీమ చిటుక్కుమన్నా విన్పించేంత నిశ్శబ్దం. అందరూ రాజు ప్రశ్నకోసం ఎదురు చూస్తున్నారు.రాజు ఇలా చెప్పాడు? "మహారాణి గారికి గుత్తి వంకాయ కూర తినాలన్పించింది. వెంటనే వంటవాడిని పిలిచింది. మసాలా బాగా వెయ్యి. ఘుమఘుమలాడేలా గుత్తి వంకాయ కూర చెయ్యి, అని ఆజ్ఞాపించింది. వంటవాడు రంగంలో దిగాడు. సన్నికల్లు మీద మాసాలా నూరుతున్నాడు. కూర వండకముందే వాసన గుబాళించేస్తోంది. వంటవాడి కూతురు ఉయ్యాల్లో ఏడుస్తోంది. పొయ్యిదగ్గర వున్న నీళ్ళ గంగాళం పట్టుకొని వంటవాడి కొడుకు ఆడుకొంటున్నాడు. ఆ నీళ్ళు పడి మంటలు ఆరుతున్నాయి. వంటవాడికి ఎక్కడలేని కోపం వస్తోంది. ఈ సంగతి వంటవాడి భార్య చూసింది. ఒరే పొయ్యి దగ్గరేం ఏ పనిరా? పొయ్యిలో పడ్డావంటే నీ చావు మూడుతుంది. జాగ్రత్త', అని వాణ్ణి తిట్టి దూరంగా లాగింది.ఎలాగైతేనేం గుత్తి వంకాయకూర తయారైంది. దాని రుచిని మహారాణిగారు మహదానందపడిపొయ్యారు. సంతోషం పట్టలేక ఆమె వంటవాణ్ణి పిలిచింది. బంగారుకాసులు బహుమానంగా ఇచ్చింది. కథ బాగా విన్నారుగా. రాణీగారు వంటవాడికి ఎన్ని బంగారు కాసులిచ్చింది? ఇదీ ప్రశ్న. సమాధానం కథలోనే వుంది. ఎవరు జవాబు చెబుతారో చెప్పండి" అని ముగించాడు రాజు.పండితులందరూ తలలు గోక్కున్నారు. కొందరు చెత్త ప్రశ్న అన్నారు. కొందరు ఇదెక్కడా శాస్త్రంలో కన్పించలేదు అని గొణుక్కొన్నారు. వెన్నెల వాళ్ళ నాన్న భుజాల మీది కెక్కి 'రాజా, జవాబు నేను చెబుతా' అంటూ పెద్దగా అరిచి చేతులూపింది. రాజు ఆ పిల్లను దగ్గరికి పిలిచాడు."చెప్పమ్మా. పెద్దవాళ్ళే జవాబు చెప్పనక్కరలేదు. తెలివిలో ఎవరు పెద్దయితే వాళ్ళే పెద్ద" అని ఆప్యాయంగా అడిగాడు."రాజా! రాణిగారిచ్చిన కాసులు వెయ్యిన్నూట పదహారు" అని జవాబు చెప్పింది వెన్నెల. రాజు ఆ పిల్లను దగ్గరకు తీసుకొన్నాడు.'శభాష్! చిన్నదానివైనా సరిగ్గా చెప్పావు. సరేగానీ జవాబు ఎలా చెప్పగలిగావు?' అని వెన్నెలని అడిగాడు. "జవాబు మీ కథలోనే వుంది రాజా. మసాలా వెయ్యిలో 'వెయ్యి' వుంది. నూరుతున్నాడులో 'నూరు' వుంది. ఏడుస్తోందిలో 'ఏడు' వుంది. 'ఆరుతున్నాయిలో 'ఆరు' ఉంది. మూడుతుందిలో 'మూడు' వుంది. మొత్తం కలిపితే 'వెయ్యిన్నూట పదహారు' గదా అంది వెన్నెల. సభ కళతాళ ధ్వనులతో ప్రతిధ్వనించింది.

# పరోపకారి



నరహరిపురంలోని శరభయ్య ఒకసారి పొరుగూరుకు కాలినడకన తన చేతిలో డబ్బు సంచీతో పనిమీద బయలుదేరాడు. అతడు ఆ ఊరుకు వెళ్లాలంటే ఒక అడవిని దాటాల్సి ఉంది. ఆ అడవిలో క్రూరమృగాలు లేవు. అందువల్ల శరభయ్య ఎవ్వరూ తోడు లేకుండా ఒంటరిగా బయలుదేరాడు.అతడు ఆ అడవిని సమీపించగానే అకస్మాత్తుగా వెనుకనుండి ఒక కోతి వచ్చి అతని సంచిని లాక్కొని మెరుపులా మాయమైంది.శరభయ్య దాని వెంబడి పరిగెత్తినా లాభం లేకపోయింది. తన అజాగ్రత్తకు తనను తానే తిట్టుకున్నాడు శరభయ్య. ఆ సంచిలో చాలా డబ్బు ఉంది. "అయ్యో! ఇప్పుడు నా సంచి ఎలా దొరుకుతుంది? డబ్బు లేకుండా నేను పొరుగూరు వెళ్లి ఏం ప్రయోజనం? అది లేకుండా నా పని పూర్తి కాదే! ఇప్పుడు నేను ఏం చేయాలి?" అని ఏడవసాగాడు.ఇంతలో రామయ్య అనే వ్యక్తి ఎదురుగా వచ్చి ఎందుకు ఏడుస్తున్నావని ఆ శరభయ్యను ప్రశ్నించాడు? శరభయ్య తాను డబ్బు సంచి పోగొట్టుకున్నట్లు చెప్పాడు. అప్పుడు రామయ్య "మీరేం బాధపడకండి! మీ సంచి మీకు తప్పకుండా దొరుకుతుంది. మీరు ఇంకొంచెం ముందుకు వెళ్ళితే అక్కడ చేమంతిపురం అనే ఊరు వస్తుంది. అక్కడ ధర్మయ్య అనే పరోపకారికి ఈ కోతుల గురించి బాగా తెలుసు. చాలా కోతులు ఆయన ఇంటికి ఆహారం కొరకు వస్తాయి కూడా! బహుశా ఈ కోతి కూడా ఆయన ఇంటికి వెళ్లి ఉంటుంది. అక్కడ మీ సంచి దొరకవచ్చు" అని సలహా ఇచ్చాడు.వెంటనే శరభయ్య ఆ ఊరికి చేరి ధర్మయ్యను కలిసి తన డబ్బు సంచి ఒక కోతి ఎత్తుకుపోయిందని చెప్పాడు. తర్వాత శరభయ్య "అయ్యా! మీ ఇంటికి ఈరోజు కోతులు వచ్చాయా! వాటి చేతుల్లో మీరు నా సంచిని చూశారా?" అని ధర్మయ్యను ప్రశ్నించాడు. అప్పుడు ధర్మయ్య "కోతులు వచ్చాయి గాని వాటి చేతుల్లో నేను ఆ సంచిని చూడలేదు. నీవేం భయపడకు! అవి తినే పదార్థాలు కావు కాబట్టి నీ సంచి ఎక్కడికీ పోదు. తప్పకుండా దొరుకుతుంది. అది అందులో ఏదైనా ఆహార పదార్థాలు ఉన్నాయేమోనని ఎత్తుకెళ్లింది. కోతికి డబ్బులు ఎందుకు? ఒక్క దొంగలకు మాత్రం ఆ సంచి దొరకకుంటే చాలు" అని ధైర్యం చెప్పాడు. అప్పుడు శరభయ్య చాలా నిరాశ పడ్డాడు. అది గమనించిన ధర్మయ్య "ఒక పని చేద్దాం. రేపు మళ్లీ కోతులు వస్తాయి. అవి ఒకవేళ నీ సంచి తెచ్చినా ఫరవాలేదు. లేకుంటే మనమే వాటిని వెంబడించి వెళ్దాం! అంతవరకు నువ్వు మా ఇంట్లోనే ఉండు" అని అతనికి అతిథ్యం ఇచ్చాడు. అందుకు శరభయ్య సంతోషించాడు.మరునాడు కోతులు వచ్చాయి. కానీ వాటి చేతుల్లో డబ్బు సంచి మాత్రం లేదు. వెంటనే ధర్మయ్య శరభయ్యతో పాటు కోతుల వెంబడి వాటిని అనుసరించి వెళ్ళాడు. అవి కొద్దిదూరం వెళ్ళిన తర్వాత అడవిలోని చెట్లల్లో మాయమయ్యాయి. అప్పుడు శరభయ్య చాలా నిరాశ పడ్డాడు. ధర్మయ్య అతనికి ధైర్యం చెప్పి తిరిగి వస్తుండగా ఒక చెట్టుకు ఆ సంచి వేలాడుతూ కనిపించింది. ధర్మయ్య వెంటనే దాన్ని తీసి చూశాడు. అందులో శరభయ్య డబ్బు సురక్షితంగా ఉంది. వెంటనే అతడు దానిని శరభయ్యకు అప్పగించాడు. శరభయ్య ఎంతో సంతోషించి "అయ్యా! మీలాంటి పరోపకారులు ఉండడం వల్లనే నాలాంటి వారికి మేలు జరుగుతున్నది. మీ సహాయాన్ని నేను మరవలేను" అంటూ తన సంచిని వెతుకుటలో తనకు సహకరించినందుకు ధర్మయ్యకు తన ధన్యవాదాలను తెలిపాడు.

# తెలివే గెలిచింది

**హైదరాబాద్ పెన్ పవర్:** ఒక దట్టమైన అడవిలో అనేక రకాల జంతువులు నివసించేవి. ఎండాకాలంలో వాటికి ఒకే ఒక నీటి ఆధారం అడవి మధ్యలో ఉన్న చిన్న కొలను. ఎండ తీవ్రంగా ఉండడంతో, చిన్న చిన్న నీటి గుంటలన్నీ అడుగంటాయి. దాహం తీర్చుకోవడానికి మిగిలిన జంతువులన్నిటికీ ఆ కొలనే దిక్కు.అదే అడవిలో ఒక పొగరుబోతు ఏనుగు ఉండేది. అది తన బలాన్ని చూసుకుని చాలా అహంకారంగా ఉండేది. ఆ పొగరుతో కొలనును పూర్తిగా తన సొంతం చేసుకుంది. ఏ జంతువునూ నీళ్లు తాగనిచ్చేది కాదు. చిన్న జంతువులు దాహం వేసి బతిమాలినా, వాటిని తరిమికొట్టి, దాడిచేసి బాధపెట్టేది. ఆ ఏనుగు వల్ల, జంతువులన్నీ దాహం తీర్చుకోవడానికి పది క్రోసుల దూరంలో ఉన్న ప్రమాదకరమైన దారిలో నదికి వెళ్లాల్సి వచ్చేది.ఏనుగు ఆగడాలు ఎక్కువ కావడంతో, జంతువులన్నీ సమావేశమై ఆ తీవ్రమైన సమస్యను గురించి మాట్లాడుకున్నాయి. ఏనుగును బతిమాలినా లాభం లేదని, ఎలాగైనా దాన్ని వదిలించుకోవాలని నిర్ణయించుకున్నాయి. ఆ సమయంలో, చిన్నదైనా చాలా తెలివైన ఒక కుందేలు ముందుకు వచ్చింది. ఆ పొగరుబోతు ఏనుగును తనే లొంగదీస్తానని ధైర్యం చెప్పింది. అప్పుడు జంతువులు, "ఒకప్పుడు పులి మీసాలు మెలివేసిన దానివి, ఈ ఏనుగు మదాన్ని తప్పక అణచేస్తావు" అంటూ కుందేలుపై నమ్మకం ఉంచాయి.?కుందేలు బాగా ఆలోచించి, తన ప్రణాళికతో ఆ రాత్రి చీకటిలోనే పది క్రోసుల దూరం నడిచి నది దగ్గరకు వెళ్లింది. నీటిలో ఉన్న మొసళ్ళ నాయకుడిని పిలిచి, తమ అడవిలోని కష్టాన్ని వివరించింది."మిత్రమా, మీరు మాకు ఈ సాయం చేస్తే, మేము మీకు అడవిలోని మంచి పండ్లు, దుంపలు తెచ్చిపెడతాము, మీ మేలు మర్చిపోము. మీకు కూడా కావలసినంత రుచికరమైన ఏనుగు మాంసం దొరుకుతుంది" అంటూ మొసళ్లకు ఆశచూపుతూ బతిమాలింది. "పని పూర్తికాగానే కొలను ఖాళీ చేసి వెళ్ళాలి" అని షరతుపెట్టింది. మొసళ్లు ఏనుగు మాంసానికి ఆశపడి ఆ షరతును అంగీకరించి, సాయం చేయడానికి వెంటనే బయలుదేరాయి.ఆ రాత్రే, కుందేలుతో కలిసి కొన్ని మొసళ్ళు కొలను దగ్గరకు వచ్చి దాక్కున్నాయి. ఏనుగు మేతకు వెళ్లిన వెంటనే, మొసళ్లు కొలనులోకి చేరి, నీటిలో కనబడకుండా మాటు వేశాయి.మేతమేసి తిరిగి వచ్చేదాక కొలను వద్ద ఎదురుచూచి, ఏనుగు దగ్గరకు రాగానే కుందేలు,"ఏనుగా! నా మాట విని నీ గర్వాన్ని వదిలి, అందరితో కలిసిపో. సాటి జంతువులకు నీళ్లు తాగే అవకాశం ఇవ్వు. ఇది నీకు నా చివరి అవకాశం,"అని గట్టిగా చెప్పింది. ఆ మాటలకు ఏనుగుకు కోపం వచ్చింది."చిన్న జీవివి నాకే సలహా చెబుతావా? నిన్ను తొక్కి చంపుతాను! వెంటనే ఇక్కడి నుంచి వెళ్ళు" అంటూ కోపంగా ఘీంకరిస్తూ కొలనులోకి దిగింది.ఏనుగు నీళ్లు చిమ్ముకుంటూ లోపలికి వెళ్లగానే, అదను చూసి! కొలనులో మాటు వేసి ఉన్న మొసళ్లు ఒక్కసారిగా ఏనుగుపై దాడి చేశాయి. మొసళ్లు గట్టిగా ఏనుగు కాళ్లు, తొండం పట్టుకుని నీటి లోపలికి లాగడం మొదలుపెట్టాయి. ఊహించని ఈ దాడికి ఏనుగు భయపడింది. బాధతో పెద్దగా అరిచింది. తన బలం అంతా ఉపయోగించినా, మొసళ్ల పట్టు నుంచి కదలలేకపోయింది. అహంకారంతో చెలరేగిన ఆ ఏనుగుకు, తోటి జంతువులను బాధపెట్టినందుకు తగిన శిక్ష పడింది.అడవి జంతువులన్నీ వచ్చి కుందేలుకు ధన్యవాదాలు చెప్పాయి. వాటి దాహం తీరింది, ఏనుగు పీడ వదిలింది. ఆనందంగా జంతువులన్నీ,"బలం కంటే తెలివే గొప్పది. తెలివే గెలిచింది. ఇకపై, 'ఏనుగు మదం కుందేలు అణచినట్టు' అనే సామెతను మనం ప్రచారం చేద్దాం!" అని చెప్పుకున్నాయి. చిన్న కుందేలు తెలివి అడవిలో అందరికీ స్వేచ్ఛను, శాంతిని అందించింది.

# కండరాలు పెరిగి చక్కని దేహం కావాలలి



కండరాలను పెంచుకోవడానికి చాలా మంది జిమ్ చేస్తూ ఉంటారు. జిమ్ చేయడం, బరువులు ఎత్తడం వల్లనే కండరాలు దృఢంగా తయారవుతాయని చాలా మంది భావిస్తారు. కానీ కండరాల పెరుగుదలకు వ్యాయామం చేయడం ఒక్కటే మార్గం కాదు. కండరాల పెరుగుదల మీరు జిమ్ చేసే ముందు, చేసిన తరువాత తీసుకునే ఆహారాలపై కూడా ఆధారపడి ఉంటుంది. మీరు తీసుకునే ఆహారంపైనే కండరాలు ఎంత వేగంగా పెరుగుతాయి, ఎంత త్వరగా కోలుకుంటాయి అనేది ఆధారపడి ఉంటుంది. ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, సరైన కార్బొహైడ్రేట్లు వంటి పోషకాలను తీసుకున్నప్పుడే కండరాల పెరుగుదల, మరమ్మత్తు వేగంగా ఉంటుంది. ఏం తినాలో.. ఎప్పుడు తినాలో.. తెలుసుకున్నప్పుడే మన శరీర కండరాలు ఆరోగ్యంగా, దృఢంగా ఉంటాయి. కండరాలను పెంచుకోవాలనుకునే వారు వ్యాయామం చేయడంతో పాటు తీసుకోదగిన ఆహారాల గురించి.. అలాగే వీటిని ఎప్పుడు తీసుకోవాలి.. అన్న వివరాల గురించి పోషకాహార నిపుణులు వివరిస్తున్నారు.

పెరుగు..

ప్రోటీన్ ఎక్కువగా, కొవ్వు తక్కువగా ఉండే ఆహారాల్లో చికెన్ బ్రెస్ట్ ఒకటి. దీనిలో 26 నుండి 31 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. గ్రిల్ చేసుకుని లేదా తక్కువ నూనెతో ఫ్రై చేసుకుని దీనిని తీసుకోవచ్చు. జిమ్ కు ముందు లేదా తర్వాత అయినా దీనిని తీసుకోవచ్చు. బ్రౌన్ రైస్ తో ఈ చికెన్ బ్రెస్ట్ ను తీసుకుంటే త్వరగా కోలుకుంటారు. అలాగే పెరుగును తీసుకోవడం వల్ల కూడా మన శరీరానికి తగినంత ప్రోటీన్ అందుతుంది. దీనిలో ఎక్కువ ప్రోటీన్ ఉంటుంది. పెరుగును తీసుకోవడం వల్ల కండరాలకు ఆమైనో ఆమ్లాలు స్థిరంగా అందుతాయి. వ్యాయామం తరువాత లేదా పడుకునే ముందు పెరుగును తీసుకోవడం మంచిది. కండరాలకు అవసరమయ్యే అమైనో ఆమ్లాలు, విటమిన్ బి12, విటమిన్ డి, వ్యాయామం తరువాత తిరిగి శక్తిని పొందడానికి అవసరమయ్యే కొవ్వులు ఉండే ఆహారాల్లో గుడ్డు ఒకటి.

కోడిగుడ్లు..

రోజూ ఒక ఉడికించిన గుడ్డును పచ్చసొనతో సహా తీసుకోవడం వల్ల కండరాల పెరుగుదల వేగంగా ఉంటుంది. ఇక ప్రోటీన్ తో పాటు ఆరోగ్యకరమైన కొవ్వులను కలిగి ఉండే ఆహారాల్లో చేపలు ఒకటి. ఇవి ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లతో నిండి ఉంటాయి. చేపలను తీసుకోవడం వల్ల కండరాల మరమ్మత్తు వేగంగా ఉంటుంది. వారానికి రెండు సార్లు మధ్యాహ్న భోజనంలో లేదా రాత్రి భోజనంలో వీటిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. సలాడ్ రూపంలో, గ్రిల్ రూపంలో వీటిని తీసుకునే ప్రయత్నం చేయాలి. మొక్క ఆధారిత ప్రోటీన్ ను కలిగి ఉండే వాటిలో కినోవా ఒకటి. వీటిలో తొమ్మిది రకాల అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఫైబర్, ఐరన్, మెగ్నిషియం వంటి పోషకాలు కూడా ఇందులో ఉంటాయి. ఈ పోషకాలన్నీ కండరాలు బాగా పనిచేయడానికి, శక్తిని పెంచడానికి దోహదపడతాయి. కండరాల పెరుగుదలకు రాత్రి భోజనంలో కినోవాను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

పనీర్..

కాటేజ్ చీజ్ లేదా పనీర్ ప్రోటీన్ తో నిండి ఉంటుంది. ఇది నెమ్మదిగా జీర్ణమవుతుంది. కనుక గంటల తరబడి కండరాలకు కావల్సిన శక్తి లభిస్తుంది. దీనిని రాత్రిపూట తీసుకోవడం మంచిది. సలాడ్, గ్రిల్ వంటి వాటితో దీనిని తీసుకోవడం వల్ల కండరాలకు కావల్సిన శక్తి లభిస్తుంది. అలాగే తృణ ధాన్యాలను, గింజలను తీసుకోవడం వల్ల కండరాల మరమ్మత్తు వేగంగా ఉంటుంది. వీటిలో ఉండే మెగ్నిషియం కండరాల పనితీరును, వాటిని మరమ్మత్తు చేయడంలో సహాయపడుతుంది. వీటిని స్నాక్స్ గా తీసుకోవడం మంచిది. ప్రోటీన్స్, మంచి కొవ్వులు, ఇతర పోషకాలు కలిగిన ఆహారాలను తీసుకోవడం వల్ల కండరాల పెరుగుదల వేగంగా ఉండడంతో పాటు వాటి మరమ్మత్తు కూడా చక్కగా జరుగుతుంది. ఇక వ్యాయామం చేసిన 30 నుండి 90 నిమిషాల వ్యవధిలో కొంత ప్రోటీన్, కార్బొహైడ్రేట్స్ తీసుకోవాలని ఒక లక్ష్యంగా పెట్టుకుని సరైన ఆహారాన్ని తీసుకోవాలి. వ్యాయామం చేయడంతోపాటు ఇలా చక్కటి ఆహారాన్ని తీసుకోవడం వల్ల మనం ఆరోగ్యకరమైన, ధృడమైన కండరాలను సొంతం చేసుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు.

## మునగతో మాతృత్వపు ఆనందం..



ఇటీవల చాలామంది బాలింతలు ఎదుర్కొంటున్న సమస్యల్లో బిడ్డకు సరిపడా చనుబాలు ఉత్పత్తి కాకపోవడం కూడా ఒకటిగా ఉంటోంది. గర్భవతిగా ఉన్నప్పుడు తగిన పౌష్టికాహారం తీసుకోకపోవడం, హార్మోన్ల అసమతుల్యత, పలు శారీరక అనారోగ్యాలు ఇందుకు కారణం అవుతుంటాయని ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. అయితే వీటన్నింటికీ సహజ సిద్ధమైన ఒక చక్కటి పరిష్కారం ఉంది. ఏంటంటే.. మునగ ఆకులను, కాడలను ఆహారంగా వాడటమే అంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఇవి చిన్న పిల్లల తల్లుల్లో బిడ్డకు సరిపడా పాల ఉత్పత్తిని పెంచడంలో సహాయపడతాయని చెబుతున్నారు. అదెలాగో చూద్దాం. లిప్రముఖ బయోమెడికల్ అండ్ లైఫ్ సైన్సెస్ జర్నల్ లో పబ్లిషైన ఒక క్లినికల్ రీసెర్చ్ ప్రకారం కూడా మునగను ఆహారంగా తీసుకున్న తల్లుల్లో చనుబాల ఉత్పత్తిలో పెరిగినట్లు వెల్లడైంది. పరిశోధనలో భాగంగా మునగను ఒక సప్లిమెంట్ మాదిరిగా బాలింతలకు ఇచ్చినప్పుడు కేవలం ఐదవ రోజు నాటికి వారిలో బ్రెస్ట్ మిల్క్ ఉత్పత్తి దాదాపు మూడు రెట్లు పెరిగింది. లిమునగ (మోరింగా) ఆకుల్లో, కాడల్లో ఐరన్, కాల్షియం, విటమిన్ ఎ, విటమిన్ సి వంటి తల్లిపాల ఉత్పత్తికి అవసరమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. కాబట్టి బాలింతలు వాటిని ఆహారంగా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. మునగ ఆకుల్లో బయోయాక్టివ్ ప్లాంట్ కాంపౌండ్స్ ఉంటాయి. కాబట్టి తల్లి పాల ఉత్పత్తికి బాధ్యత వహించే హార్మోన్ అయిన ప్రొలాక్టిన్ స్థాయిలను పెంచుతుంది. చనుబాల నాణ్యత, పరిమాణాన్ని కూడా మెరుగుపరుస్తుంది. కాబట్టి గర్భవతులు, బాలింతలు ఏదో ఒక రూపంలో మునగను ఆహారంగా ఉపయోగించడం వారిలో చనుబాల ఉత్పత్తిని పెంచడం ద్వారా మాతృత్వపు ఆనందాన్ని రెట్టింపు చేస్తుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

## టీమిండియాతో సెమీ ఫైనల్లో ఓటమి.. 8 సార్లు వరల్డ్ కప్ విజేత అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా తరఫున అత్యుత్తమ మహిళా క్రికెటర్లలో ఒకరైన అలిస్సా హీలీ తన అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించింది. బుధవారం (జనవరి 13) హీలీ తన రిటైర్మెంట్ విషయాన్ని అధికారికంగా వెల్లడించింది. మార్చిలో టీమిండియాతో జరగబోయే వన్డే సిరీస్ తన కెరీర్ లో చివరిదని ఈ ఆస్ట్రేలియా కెప్టెన్ కెప్టెన్ తెలిపింది. ఈ టూర్ లో భాగంగా పెర్త్‌లో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ తో పాటు ఒక టెస్ట్ మ్యాచ్ కు హీలీ చివరిసారిగా నాయకత్వం వహిస్తుంది. అయితే టీ20 సిరీస్ కు మాత్రం ఈ ఆసీస్ దిగ్గజం అందుబాటులో ఉండదు. ఎందుకంటే ఆమె 2026 ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ ఆడదు. కాబట్టి టీ20 సిరీస్ ఆడినా పెద్ద ప్రయోజనం ఉండదు. రిటైర్మెంట్ తర్వాత హీలీ మాట్లాడుతూ ఇలా చెప్పుకొచ్చింది. " ఆస్ట్రేలియా తరఫున ఇండియాతో జరగబోయే సిరీస్ నా చివరిది కావడం ఎమోషన్ తో కూడుకుంది. ఆస్ట్రేలియా తరఫున ఆడటం నాకు ఇప్పటికీ ఇష్టమే. కానీ నాలో పోటీతత్వం తగ్గిపోయింది. జట్టును ముందుకు నడిపించడంలో నేను వెనకబడ్డాను. నా రిటైర్మెంట్ కు ఇదే సరైన సమయం అని నేను భావిస్తున్నాను. ఈ సంవత్సరం నేను టీ20 ప్రపంచ కప్ ఆడను. ఇండియాతో జరగబోయే టీ20 సిరీస్ ఆడడం లేదు. చివరిసారిగా ఇండియాతో వన్డే, టెస్ట్ సిరీస్ కు కెప్టెన్ గా అవకాశం వచ్చినందుకు నేను సంతోషంగా ఉన్నాను". అని హీలీ చెప్పుకొచ్చింది.

దశాబ్దానికి పైగా హీలీ ఆస్ట్రేలియా విజయాల్లో కీలక పాత్ర పోషించింది. ఈ ఆసీస్ కెప్టెన్ ఓవరాల్ గా ఎనిమిది వరల్డ్ కప్ టైటిల్స్ గెలవడం విశేషం. వీటిలో ఆరు టీ20 వరల్డ్ కప్ ట్రోఫీలతో పాటు రెండు వన్డే వరల్డ్ కప్ టైటిల్స్ ఉన్నాయి. గత ఏడాది భారత్ వేదికగా జరిగిన వన్డే వరల్డ్ కప్ లో టీమిండియా చేతిలో ఓడిపోవడం హీలీని తీవ్రంగా బాధించింది. ఆస్ట్రేలియా తరఫున 10 టెస్ట్ ల్లో 30.56 సగటుతో 489 పరుగులు.. 123 వన్డేల్లో 35.98 యావరేజ్ తో 3563 పరుగులు.. 162 టీ20ఐ మ్యాచ్‌లలో ఒక సెంచరీతో 25.45 సగటుతో 3054 పరుగులు చేసి ఆస్ట్రేలియా క్రికెట్ ;లో దిగ్గజ క్రికెటర్ గా నిలిచింది.

## విజయ్ హజారే ట్రోఫీ సెమీ ఫైనల్‌కు విదర్భ, పంజాబ్.. సెమీస్ షెడ్యూల్ ఇదే!






**హైదరాబాద్ పెన్ పవర్:** విజయ్ హజారే ట్రోఫీలో సెమీస్ కు వెళ్లిన నాలుగు జట్లేవో తెలిసిపోయింది. మంగళవారం (జనవరి 13) కర్ణాటక, సౌరాష్ట్ర సెమీస్ కు చేరుకున్న సంగతి తెలిసిందే. బుధవారం (జనవరి 13) మరో రెండు జట్లు సెమీస్ కు అర్హత సాధించాయి. మధ్య ప్రదేశ్ తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో పంజాబ్ భారీ విజయం సాధించింది. బెంగళూరు వేదికగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్ 1 లో జరిగిన మ్యాచ్ లో పంజాబ్ ఏకంగా 183 పరుగులు భారీ తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 345 పరుగులు చేసింది. ప్రబు సిమ్రాన్ సింగ్ 88 పరుగులు చేసి టప స్కోరర్ గా నిలిచాడు. అల్మోప్రీత్ సింగ్ (70), నేహాల్ వధేరా (56) హాఫ్ సెంచరీలు చేసి కీలక ఇన్నింగ్స్ ఆడారు. లక్ష్య ఛేదనలో మధ్య ప్రదేశ్ కేవలం 162 పరుగులకే ఆలౌటైంది. చివరి క్వార్టర్ ఫైనల్లో ఢిల్లీపై విదర్భ ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన విదర్భ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 300 పరుగులు చేసింది. యాష్ రాథోడ్ 86 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. అథర్వ తైడే (62) హాఫ్ సెంచరీతో రాణించాడు. లక్ష్య ఛేదనలో ఢిల్లీ 224 పరుగులకే ఆలౌటైంది. అనుజ్ రావత్ 66 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకుండా పోయింది.

**సెమీస్ షెడ్యూల్:**

తొలి సెమీ ఫైనల్ : కర్ణాటక జం విదర్భ: గురువారం (జనవరి 15)

రెండో సెమీ ఫైనల్: పంజాబ్ జం సౌరాష్ట్ర: శుక్రవారం (జనవరి 16)

ఫైనల్ : ఆదివారం (జనవరి 18)

**సెమీస్ కు సౌరాష్ట్ర:**

కెప్టెన్ హర్విక్ దేశాయ్ (100 నాటౌట్) సెంచరీతో చెలరేగడంతో.. విజయ్ హజారే ట్రోఫీలో సౌరాష్ట్ర సెమీస్‌లోకి అడుగుపెట్టింది. ప్రేరక్ మన్కడ్ (67), చిరాగ్ జైన్ (40 నాటౌట్) బ్యాట్లు ఝుళిపించడంతో.. సోమవారం జరిగిన రెండో క్వార్టర్‌ఫైనల్లో సౌరాష్ట్ర 17 రన్స్ తేడాతో (వీజేడీ పద్ధతి) ఉత్తరప్రదేశ్‌పై గెలిచింది. టాస్ ఓడిన యూపీ 50 ఓవర్లలో 310/8 స్కోరు చేసింది. అభిషేక్ గోస్వామి (88), సమీర్ రిజ్వి (88), ప్రియమ్ గార్గ్ (35), ప్రశాంత్ వీర్ (30) రాణించారు. చేతన్ సకారియా 3, అంకూర్ పన్వర్, ప్రేరక్ మన్కడ్ చెరో రెండు వికెట్లు తీశారు. తర్వాత సౌరాష్ట్ర 40.1 ఓవర్లలో 238/3 స్కోరు చేసింది. ఈ దశలో వర్షం వల్ల మ్యాచ్‌కు అంతరాయం కలిగింది. అప్పటికే వీజేడీ పద్ధతిలో సౌరాష్ట్ర ఎక్కువ స్కోరు చేసి ఉండటంతో విజేతగా ప్రటించారు.

**వరుసగా నాలుగో సారి సెమీస్ కు కర్ణాటక:**

ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకున్న డిఫెండింగ్ చాంపియన్ కర్నాటక.. వరుసగా నాలుగోసారి విజయ్ హజారే ట్రోఫీ సెమీస్‌లోకి ప్రవేశించింది. ఛేజింగ్‌లో దేవదత్ పడిక్కల్ (81 నాటౌట్), కరుణ్ నాయర్ (74 నాటౌట్) దంచికొట్టడంతో.. సోమవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో కర్నాటక 55 రన్స్ తేడాతో (వీజేడీ పద్ధతి) ముంబైపై నెగ్గింది. టాస్ ఓడిన ముంబై 50 ఓవర్లలో 254/8 స్కోరు చేసింది. శామ్స్ ములానీ (86) టాప్ స్కోరర్. సిద్ధేశ్ లాడ్ (38), సాయిరాజ్ పాటిల్ (33 నాటౌట్), అంగ్‌క్రిష్ రఘువంశీ (27), ఇషాన్ మూల్‌చందానీ (20) రాణించారు.

## ఇండియాలో ఆడే ముచ్చటే లేదు: మరోసారి తేల్చిచెప్పిన బంగ్లాదేశ్.. ఐసీసీ నిర్ణయంపై ఉత్కంఠ




**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 టీ20 వరల్డ్ కప్ కోసం భారతదేశానికి వెళ్లే ముచ్చటే లేదని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (దీజదీ) పునరుద్ఘాటించింది. భద్రతా సమస్యల కారణంగా ఇండియాకు వెళ్లలేమని మరోసారి ఐసీసీకి తేల్చి చెప్పింది బీసీబీ. ఇటీవల బంగ్లాదేశ్, భారత్ మధ్య ఉద్రిక్తతలు తలెత్తిన విషయం తెలిసిందే. బంగ్లాదేశ్ స్టూడెంట్ లీడర్ ఉస్మాన్ హాదీ హత్య తర్వాత ఆ దేశంలో అల్లర్లు చెలరేగాయి. ఈ అల్లర్లు క్రమంగా ఇండియాకు వ్యతిరేకంగా మారాయి. బంగ్లాలో పెద్ద ఎత్తున భారత వ్యతిరేక నిరసనలు వ్యక్తం అయ్యాయి. అంతేకాకుండా మైనార్టీలపై ఆ దేశంలో దాడులు పెరిగాయి. ముఖ్యంగా హిందువులను టార్గెట్ చేసి హత్య చేస్తున్నారు. దీంతో ఐపీఎల్‌లో బంగ్లా క్రికెటర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ ఆడకుండా బీసీసీఐ నిషేధం విధించింది. ఈ పరిణామాలతో ఇండియా, బంగ్లా మధ్య సంబంధాలు క్షీణించాయి. దీంతో 2026, ఫిబ్రవరిలో ఇండియా, శ్రీలంక వేదికగా జరగనున్న టీ20 వరల్డ్ కప్ కోసం భారత్‌లో పర్యటించలేమని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) ఐసీసీకి చెప్పింది. ఆటగాళ్ల భద్రతా సాకుగా చూపిస్తూ ఇండియాలో పర్యటించలేమంది. అలాగే.. రాబోయే టీ20 వరల్డ్ కప్‌లో ఇండియాలో జరిగే తమ మ్యాచ్‌లను తటస్థ వేదికకు (శ్రీలంకకు) మార్చాలని ఐసీసీని కోరింది. ఈ అంశంపై చర్చించేందుకు మంగళవారం (జనవరి 13) బీసీబీ సభ్యులతో ఐసీసీ వర్చువల్‌గా సమావేశమైంది. ఈ సమావేశంలో బీసీబీ అధ్యక్షుడు ఎండీ అమీనుల్ ఇస్లాం, ఉపాధ్యక్షులు ఎండీ షకావత్ హుస్సేన్, ఫరూక్ అహ్మద్, క్రికెట్ ఆపరేషన్స్ కమిటీ డైరెక్టర్, ఛైర్మన్ నజ్ముల్ అబేదీన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నిజాం ఉద్దీన్ చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీబీ అధికారులు తమ వైఖరిని పునరుద్ఘాటించారు. ఆటగాళ్లు, జట్టు అధికారులు, సహాయక సిబ్బంది భద్రత భద్రతా సమస్యల కారణంగా రాబోయే టీ20 వరల్డ్ కప్ కోసం ఇండియాలో పర్యటించలేమని బీసీబీ మరోసారి స్పష్టం చేసింది. బంగ్లాదేశ్ మ్యాచ్‌లను తటస్థ వేదికలకు మార్చాలని ఐసీసీని కోరింది. అయితే.. టోర్నీ షెడ్యూల్ ఇప్పటికే ఖరారైందని.. తన నిర్ణయాన్ని పునఃపరిశీలించుకోవాలని బీసీబీకి ఐసీసీ సూచించింది. కానీ బీసీబీ వెనక్కి తగ్గలేదు. తమ వైఖరిలో మార్పు లేదని బీసీబీ ప్రతినిధులు ఐసీసీకి తేల్చి చెప్పారు. ఒకవైపు షెడ్యూల్ ఖరారు కావడం.. మరోవైపు బీసీబీ వెనక్కి తగ్గకపోవడంతో ఈ అంశంలో ఐసీసీ ఎలాంటి నిర్ణయం తీసుకుబోతుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

**ఇండియాలో నాలుగు లీగ్ మ్యాచ్ లు:**

భారత్, శ్రీలంక ఆతిథ్య దేశాలుగా 2026, ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8వ తేదీ వరకు టీ20 వరల్డ్ కప్ జరగనుంది. టీ20 వరల్డ్ కప్ షెడ్యూల్ ప్రకారం ఇండియాలో బంగ్లాదేశ్ మొత్తం నాలుగు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. మూడు కోల్‌కతాలో ఒకటి ముంబైలో జరగనుంది. ఫిబ్రవరి 7న వెస్టిండీస్, ఫిబ్రవరి 9న ఇటలీ, ఫిబ్రవరి 14న ఇంగ్లాండ్ తో కోల్‌కతాలో మ్యాచ్ లు ఆడనుంది. ఫిబ్రవరి 17న ముంబైలో నేపాల్ తో మ్యాచ్ ఆడాల్సి ఉంది.

**శ్రేయా ధన్వంతరి బ్లాక్ లేస్‌లో గ్లామ్ అందిస్తోంది**



## హిట్ మెషిన్ రేసులో ఇద్దరు హీరోలా?



హిట్ మెషిన్ అనీల్ రావిపూడికి ఇంత వరకూ వైఫల్యం ఎదురవ్వలేదు. దర్శకధీరుడు రాజమౌళి తర్వాత అప జయం ఎరుగని మరో దర్శకుడిగా రికార్డు సృష్టించాడు. రాజమౌళి తర్వాత రాజమౌళి అంతటి వాడిగా నీరాజనాలు అందుకుంటున్నాడు. తాను తీసేవి గొప్ప కథలు కాకపోయినా ప్రేక్షకుల్ని ఎంటర్ టైన్ చేస్తున్నాడు. నిర్మాతకు లాభాలు తెచ్చి పెడుతున్నాడు. హీరోలకు వరుస విజయాలు అందిస్తున్నాడు. ఇప్పటికే ఎనిమిది వరుస విజయాలు అందుకున్న అనీల్ తాజాగా రిలీజ్ అయిన -మనశంకరవ రప్రసాద్ గారు- తో తొమ్మిదవ సక్సెస్ ను కూడా ఖాతాలో వేసుకున్నాడు.

ఈ సంక్రాంతి కూడా అనీల్ దే అనిపించాడు. మిగతా మూడు చిత్రాల రిలీజ్ అనంతరం ఎమ్ ఎస్ జీ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుంది? అన్నది ఓ అంచనా వస్తుంది. ఇప్పటికే అనీల్ ఖాతాలో వరుసగా ట్రిపుల్ హ్యాట్రిక్ నమోదైనట్లే. దీంతో అనీల్ 10వ సినిమా ఏ హీరోతో ఉంటుంది? అనే చర్చ మొదలైంది. ఆయన సినిమా మొదలు పెడితే గనుక ఇదే ఏడాదే ఆ సినిమా రిలీజ్ అవుతుంది. అందులో ఎలాంటి డౌట్ లేదు. సంవత్సరాల పాటు హీరో, నిర్మాతల సమయాన్ని తినే దర్శకుడు కాదు. కాబట్టి పదవ సినిమా ఏడాది ముగింపులోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే అవకాశం ఉంది.అయితే అందులో హీరో ఎవరవుతారు? అన్నదే ఆసక్తికరం. ఇప్పటికే కింగ్ నాగార్జున పేరు జోరుగా వినిపిస్తోంది. అనీల్ కూడా కింగ్ విషయంలో పాజిటివ్ గా ఉన్నాడు. నాగ్ తో పనిచేస్తే సీనియర్లు అందర్నీ కవర్ చేసినట్లు అవుతుందని భావిస్తున్నాడు. ఆ దిశగా అనీల్ సీరియస్ గానే ఆలోచన చేస్తున్నాడు అన్నది కాదనలేని నిజం. ఇదే జరిగితే టాలీవుడ్ లో మొదటి న్యూ-ఏజ్ డైరెక్టర్‌గా అనిల్ అరుదైన గుర్తింపు దక్కినట్లే. ప్రస్తుతం నాగార్జున తన 100వ సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్నాడు. ఈ సినిమా షూటింగ్ పై మరో రెండు నెలల్లో క్లారిటీ వస్తుంది.అనంతరం నాగ్ షెడ్యూల్ కూడా బయటకు వస్తుంది. దాన్ని బట్టి అనీల్ ప్లాన్ చేసే ఛాన్స్ లేకపోలేదు.అలాగే 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రానికి సీక్వెల్ చేసే ఆలోచన ఉన్నట్లు కూడా రావిపూడి ఇప్పటికే హింట్స్ ఇచ్చాడు. కానీ ఈ కాంబినేషన్ ఇప్పటికప్పుడే రిపీట్ అవ్వదు. అందుకు సమయం పడుతుంది. చిరంజీవి-వెంకటేష్ తో మల్టీస్టారర్ కూడా ఉంది కాబట్టి సీక్వెల్ కి కాస్త సమయం తీసుకుంటాడు.వెంకటేష్ కూడా మరో సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్నాడు. అలాగే దిల్ రాజు బ్యానర్లో అనీల్ మరో సినిమా చేయాల్సి ఉంది. అందులో హీరో ఎవరు? అన్నది ఇంకా డిసైడ్ అవ్వలేదు. పవన్ కళ్యాణ్ తో రాజుగారు ముందుకొచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది. కానీ అది జరుగుతుందా? లేదా? అన్నది చూడాలి.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965